



అంపాపురంలో తమ ప్లాట్ల వద్ద బాధితుల ఆందోళన

లెక్క పక్కాగా..

జిల్లాలో ఇంటి పన్నుల వివరాలు మదింపు

పంచాయతీల్లో వేగవంతంగా ప్రక్రియ

- ఈ నెలాఖరుకు స్వర్ణ పంచాయతీ యాప్‌లో వివరాలు
- ఇక పన్ను చెల్లించాలంటే యాప్‌లో చెల్లించాల్సిందే..
- భవిష్యత్‌లో భూమి విలువ ఆధారంగానే పెంపు
- అడుగుల లెక్కన విధింపునకు ఉత్తర్వులు
- ఇప్పట్లో అమలు కావంటున్న అధికారులు

పంచాయతీల్లో ఇంటి పన్నుల మదింపు ప్రక్రియ వేగవంతమవుతోంది. గతంలో విధించిన ఇంటి పన్నుల్లో ఏమైనా లోపాలుంటే సరిచేసి, ఈనెల 31లోగా స్వర్ణ పంచాయతీ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలోని 474 పంచాయతీల్లోని అధికారులు అదే పనిలో పడ్డారు.



చిన్నాపురం పంచాయతీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని పంచాయతీల్లో ఇంటి పన్నులకు సంబంధించిన వివరాలను రెండు మూడు నెలలుగా పంచాయతీ ఉద్యోగులు సేకరిస్తున్నారు. ఇంటి విస్తీర్ణం, చుట్టూ ఖాళీస్థలం, నూతన నిర్మాణాలు, వాటి పన్ను వివరాలను ప్రభుత్వం రూపొందించిన స్వర్ణ పంచాయతీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటి యజమాని పేరు, తండ్రి పేరు, ఇంటి నెంబరు, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లు సక్రమంగా లేకుంటే వాటిని సరిచేసి పూర్తి వివరాలతో యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఇలా పూర్తయితే గతంలో మాదిరిగా ఇంటి పన్నులు చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇవ్వడం, పంచాయతీల్లో పనిచేసే బిల్ కలెక్టర్లు ఇంటింటికీ వచ్చి ఇంటి పన్నులు వసూలు చేయడం వంటి ప్రక్రియ ఉండదు. స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా నేరుగా ఇంటి యజమాని పేరున్న సెల్‌ఫోన్ నెంబరుకు సమాచారం అందుతుంది. నేరుగా పన్నులు చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. నవంబరు, డిసెంబరు నాటికి ఇది అందుబాటులోకి రానుంది. వీటితో పాటు పంచాయతీల్లోని వాణిజ్య సముదాయాలు, చేపల చెరువుల వేలంపాటలు, సంతలు, తదితరాల ద్వారా వచ్చే రాబడి మొత్తాన్ని స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారానే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఏటా రూ.60 కోట్ల వసూలు

జిల్లాలోని 474 పంచాయతీల్లో గత ఏడాది రూ.60 కోట్లకు పైగా ఇంటి పన్నుల డిమాండ్ ఉంది. గతంలో బిల్ కలెక్టర్లు లేదా పంచాయతీలు ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ ఉద్యోగులతో వసూలు చేసేవారు. దీంతో కొన్ని పంచాయతీల్లో పన్నుల నగదు మాయమైన ఘటనలు జరిగాయి. ఎవరో ఒకరు ఈ నగదు పక్కదారి పట్టిన విషయంపై ఫిర్యాదులు చేస్తేనే పంచాయతీ శాఖ అధికారులు విచారణ చేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఏడాదికిపైగా సమయం పట్టేది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఇంటి పన్ను పెరిగే అవకాశం

ఈ ఏడాది పంచాయతీల్లోని వాణిజ్య సముదాయాలతో పాటు అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు సంబంధించిన పన్నులను ఆయా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నమోదై ఉన్న భూమి విలువను బట్టి పెంచాలని గత ఏడాది డిసెంబరు 17న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. గతంలో ఇంటి నిర్మాణం ఎంత విస్తీర్ణంలో ఉందో లెక్కగట్టి గజాల లెక్కన పన్ను విధించేవారు. గజానికి రూ.500లోపుగా నిర్ణయించేవారు. కొత్తగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో గజాల లెక్కన కాకుండా, అడుగుల్లో లెక్కించాలని పేర్కొన్నారు. దీంతో ఇంటి పన్నులు గతంలో కంటే రెండింతలు అధికంగా పెరగనున్నాయి. ఉదాహరణకు నాగాయలంకలోని నివాస ప్రాంతంలో గజం విలువ రూ.7 వేలు, అవనిగడ్డలో గజం విలువ రూ.10 వేలకు పైగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న భూమి విలువను బట్టి ఇంటి పన్ను విధించాలని ఆదేశాలు జారీకావడంతో ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో పంచాయతీ ఈవోలు, సిబ్బంది ఆ లెక్కలు కూడా సరిచూసి స్వర్ణ పంచాయతీ యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ వివరాలను బట్టి.. ఈ ఏడాది ఇంటి పన్నులను పెంచి వసూలు చేస్తారా లేదా అనే అంశం ప్రశ్నార్థకంగా మారింది.



ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- మీకోసంలో ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

6

బ్రహ్మంగారి జెండా పండుగకు వేళాయె

- రెండు జెండా పండుగలకు ఈడుపుగల్లు ముస్తాబు



8

రియల్ మోసం

- విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీలో పనిచేసిన వారికీ టోకరా
- బాపులపాడు తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు

అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం

- కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్
- వెంచర్‌లో ప్లాట్లు కొన్నవారి స్థలాల్లో మరో రిజిస్ట్రేషన్
- ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియక లబోదిబో
- బాధితుల్లో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్) : గన్నవరంలో మరో 'రియల్' మోసం వెలుగుచూసింది. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం అంపాపురంలో భారీ వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన బాధితులు పెద్దసంఖ్యలో ప్లాట్లు కొని మోసపోయారు. ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ యాజమాన్యం అదృశ్యమైంది. కొనుగోలు చేసిన ప్లాట్లు వ్యవసాయ పొలాలుగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఏకంగా వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. తమ ప్లాట్ల దగ్గరకు వెళ్తున్న కొనుగోలుదారులను చూసి.. స్థానికుల ఆ స్థలాలు మావి అంటూ అడ్డుకుంటున్నారు. దీంతో మొత్తం 80 మంది బాధితులు సోమవారం బస్సులో బాపులపాడు తహసీల్దార్ మురళీకృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మోసంలో కృష్ణాజిల్లాతో పాటు గుంటూరు, తెనాలికి చెందిన వందల మంది మధ్యతరగతి వారు బాధితులుగా ఉన్నారు. వీరిలో విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీకి చెందినవారు కూడా ఉన్నారు.

జరిగింది ఇలా..

అంపాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 201-1, 203-1, 210-2, 213-2లో సుమారు 44 ఎకరాల్లో 33 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చినట్టు ప్రచారం చేసి 2010లో వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వెంచర్ వేసింది. కృష్ణా, గుంటూరు, తెనాలి జిల్లాలకు చెందిన సుమారు 443 మందికి ప్లాట్లను విక్రయించింది. నాటి పంచాయితీ అధికారి సంతకంతో కూడిన లేఅవుట్ ప్లాన్, పంచాయితీకి కట్టిన రశీదుల ఆధారంగా ఆ సంస్థ రిజిస్ట్రేషన్లు చేసింది. కాగా, 2020, ఆ తర్వాత కొందరు వ్యక్తులు వెంచర్ వేసిన ఈ భూమిలోని 13 ఎకరాలను వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు కూడా పొందడం గమనార్హం. అయితే, వెంచర్‌లో ప్లాట్లు కొన్న వారిలో కొందరు కంచె వేసుకునే ప్రయత్నాలు చేయగా, స్థానికంగా కొందరు అడ్డుకున్నారు. అప్పటికే వీవీఆర్ నిర్వాహకులు పత్తా లేకుండాపోవడంతో మోసపోయామని గ్రహించిన కొనుగోలుదారులు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) ద్వారా రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొనుగోలుదారుల్లో 80 మందికిపైగా బాధితులు కమిటీగా ఏర్పడి సోమవారం బస్సులో వెళ్లి తహసీల్దార్ మురళీకృష్ణను కలిశారు. తమ దగ్గరున్న సర్వే నెంబర్లు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో కూడిన ఆధారాలను చూపించి న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయేతర భూమికి రెవెన్యూ వారు పట్టాదారు పాసు పుస్తకాలు ఎలా మిగతా 6లో..

11 అలంకారాల్లో అమ్మ దర్శనం

ఈసారి దసరా ఉత్సవాల్లో ప్రత్యేకం

- తిథుల్లో హెచ్చుతగ్గులే కారణం
- ఈసారి కాత్యాయినీదేవి దర్శనం
- పదేళ్లకోసారి కలిగే భాగ్యం



ఇంద్రకీలాద్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ 11 రోజుల పాటు వివిధ అలంకారాల్లో భక్తులను అనుగ్రహించనుంది. సాధారణంగా తిథులు, నక్షత్రాలను బట్టి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు (నవరాత్రులు)గా నిర్వహిస్తారు. ఒకరోజు హెచ్చుతగ్గులు, నక్షత్రాల కలయిక వంటి కారణాలతో 10 రోజులు నిర్వహిస్తారు. కానీ, ఈసారి 11 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. తిథుల్లో హెచ్చుతగ్గుల కారణంగా పదేళ్లకోసారి ఈ భాగ్యం కలుగుతుంది. 2016లో ఇలా జరుగగా, ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల ఉత్సవాలు నిర్వహించాలని అధికారులు సంకల్పించారు.

సెప్టెంబరు 25న కాత్యాయినీదేవి అలంకారం

సెప్టెంబరు 25వ తేదీ గురువారం చవితి తిథి మధ్యాహ్నం తరువాత కూడా ఉండటంతో ఆరోజు దుర్గమ్మ కాత్యాయినీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఉత్సవాల్లో ఇది అదనపు అలంకారం. కాత్యాయినీదేవిని చాలామంది భక్తులు ఇలవేల్పుగా కొలుస్తారు. ఆమెను పూజించిన మిగతా 6లో..

2016 తర్వాత..

2016 పుష్కరాల సమయంలో ఇలాగే తిథి హెచ్చుతగ్గులు రావటంతో 11 రోజుల పాటు దసరా ఉత్సవాలు నిర్వహించారు. పుష్కరాలు కూడా కలిసి రావటంతో దుర్గమ్మను దర్శించుకోవటానికి భక్తులు తరలివచ్చారు.

టెండర్ల ట్రాక్‌లోకి..



విజయవాడ మొదటి దశ మెట్రోకు టెండర్లు

నోటిఫికేషన్ ఇచ్చిన ఏపీఎంఆర్‌సీ అధికారులు

- రూ. 4,150 కోట్ల అంచనాతో మొదటి దశ పనులు
- గన్నవరం-పీఎన్‌బీఎస్ వరకు 25.95 కిలోమీటర్లు కారిడార్-1
- పెనమలూరు-పీఎన్‌బీఎస్ వరకు 12.45 కిలోమీటర్లు కారిడార్-2
- మొత్తం 38.40 కిలోమీటర్ల మేర వయాడక్ట్ నిర్మించాలని నిర్దేశం
- 32 ఎలివేటెడ్, ఒక అండర్ గ్రౌండ్ సహా 33 స్టేషన్ల నిర్మాణం
- విజయవాడ ఎయిర్‌పోర్టు వరకు అండర్ గ్రౌండ్ మెట్రోనే..
- సెప్టెంబరు 17న టెండర్ల ఓపెన్.. రెండున్నరేళ్లలో పూర్తి చేయాలి
- నిడమానూరు-రామవరప్పాడు ఫ్లైఓవర్ నిర్మాణం కూడా..

దశాబ్దం నాటి కల సాకారానికి మొదటి అడుగు పడింది. విజయవాడ మెట్రో రైల్ నిర్మాణ పనులకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీఎల్) అధికారులు సోమవారం టెండర్లు పిలిచారు. సెప్టెంబరు 12 నుంచి టెండర్లు సమర్పించాల్సి ఉండగా, రెండున్నరేళ్లలో మెట్రో మొదటి దశ, రెండేళ్లలో నిడమానూరు-రామవరప్పాడు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించాల్సి ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రూ.4,150 కోట్లతో విజయవాడ మెట్రో కారిడార్-1, 2 మొదటి దశ నిర్మాణ పనులకు సోమవారం టెండర్లు పిలిచారు. రెండు కారిడార్లు కలిపి మొత్తం 38.40 కిలోమీటర్లు ఉండగా, వయాడక్ట్ నిర్మాణ పనులకు ఏపీఎంఆర్‌సీఎల్ టెండర్లు పిలిచింది. ఇందులో అంతర్భాగంగా నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు 4.33 కిలోమీటర్ల పొడవున నాలుగు లేన్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌కు కూడా టెండర్లు పిలిచింది. మొత్తం 32 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు, ఒక అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్ నిర్మించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో నిర్దేశించింది. విజయవాడ ఎయిర్‌పోర్టు వరకు అండర్ గ్రౌండ్‌లో మెట్రోను నిర్మించేలా ప్రతిపాదించింది. సెప్టెంబరు 17వ తేదీ వరకు టెండర్ల సమయాన్ని నిర్దేశించింది. ఈ 45 రోజుల్లో భూ సేకరణ, ట్రాఫిక్ మళ్లింపు, పైపులైన్లు, కరెంట్ తీగలు, యూజీడీ పైపులైన్ల మార్పు, రుణ ప్రయత్నాలు కొలిక్కి తీసుకొస్తారు. సెప్టెంబరు 12 నుంచి టెండర్లు సమర్పించాల్సి ఉంటుంది. 12 నుంచి మిగతా 6లో..

ప్రధాన రహదారులే కేంద్రంగా..

విజయవాడ మీదుగా వెళ్లే రెండు ప్రధాన జాతీయ రహదారులు ఎన్‌హెచ్-16, 65ను మెట్రో ప్రాజెక్టు పరిధిలోకి తీసుకొచ్చారు. నగరంలో అంతర్గత ప్రధాన రహదారులైన బందరు రోడ్డు, ఏలూరు రోడ్లను కూడా కలిపారు. అత్యంత రద్దీగా ఉండే ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారగా, మెట్రో రాకతో ఆ సమస్యకు చెక్ పడనుంది.



మళ్లీ ఆశలు

విజయవాడ-సింగపూర్‌కు విమాన సర్వీసు నడపండి

- సీఎం చంద్రబాబుకు సింగపూర్‌లోని తెలుగువారి విజ్ఞప్తి
- వర్కవుట్ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి
- గతంలోనే విజయవంతంగా నడిచిన సర్వీసు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసుపై మళ్లీ ఆశలు నెలకొంటున్నాయి. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబును అక్కడి తెలుగువారు విజయవాడకు విమాన సర్వీసు గురించి అడగ్గా, వర్కవుట్ చేస్తామని సమాధానమిచ్చారు. దీంతో విజయవాడ నుంచి సింగపూర్‌కు డైరెక్ట్ ఫ్లైట్ ఏర్పాటుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గతంలో ఇండిగో సర్వీసు

ఏడేళ్ల కిందట విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసు నడిచింది. నాటి టీడీపీ హయాంలో సింగపూర్‌కు మిగతా 6లో..

ఆదర్శ భక్తురాలు గోదాదేవి

మచిలీపట్నంలో ప్రణవానందదాస్ ప్రభూజీ ప్రవచనం

మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గోదాదేవి.. శ్రీకృష్ణ పరమాత్ముని ఆరాధించిన భక్తితత్పరత అందరికీ ఆదర్శమని ఇస్కాన్‌కు చెందిన ప్రణవానందదాస్ ప్రభూజీ ప్రవచించారు. జగద్గురు శ్రీరామానుజాచార్య సంస్థాన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక దయాకుంబ్ ప్రాంగణంలో గీతా గోవిందం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం గోదా కల్యాణం జరిగింది. సంస్థాన్ నిర్వాహకులు గుదిమెళ్ల శ్రీకరరామానుజస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రణవానందదాస్ ప్రభూజీ మాట్లాడారు. గోదాదేవి శ్రీకృష్ణ పరమాత్ముడిని ఆరాధించి మోక్షమార్గాన్ని ఎలా సాధించారో వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ పాల్గొన్నారు. చిన్నారుల గోదాదేవి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



గోదాదేవి, శ్రీకృష్ణుడి వేషధారణల్లో చిన్నారులు (ఇన్‌సెట్‌లో) ప్రవచిస్తున్న ప్రణవానందదాస్ ప్రభూజీ



డీఆర్ఎం మోహిత్ సోనాకియాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దుర్గమ్మ సేవలో నూతన డీఆర్ఎం

ఇంద్రకీలాద్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజనల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన మోహిత్ సోనాకియా సోమవారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈవో శీనానాయక్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



అభివృద్ధి పనులకు ఈవోకు విరాళాలు అందజేస్తున్న దాతలు

దుర్గగుడి అభివృద్ధి పనులకు దాతల విరాళాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అభివృద్ధి పనుల నిమిత్తం, నిత్య అన్నదాన పథకానికి పలువురు దాతలు సోమవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు. మచిలీపట్నంకు చెందిన సర్వ లలిత కుటుంబసభ్యులు ఆలయ అభివృద్ధి పనులకు రూ.2లక్షలు, నిత్య అన్నదాన పథకానికి మరో రూ.2లక్షలు విరాళంగా ఈవో శీనానాయక్‌కు అందజేశారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని షిరిడీ సాయి కనస్ట్రక్షన్స్ సంస్థ ఎండీ ఎస్.శ్రీనివాస్, వసంత దంపతులు ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.2లక్షల చెక్కును ఈవోకు అందజేశారు. విజయవాడకు చెందిన అట్లూరి రామచంద్రరావు, విజయలక్ష్మీ దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష చెక్కును ఏఈవో రమేష్ బాబుకు అందజేశారు.

వీఎంసీ నీటి సరఫరాకు ప్రధాని ప్రశంస

- మంత్రి నారాయణ

కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వీఎంసీ నీటి సరఫరాను ప్రధాని మోదీ ప్రశంసించడం, విజయవాడ నగరానికే గర్వకారణమని మంత్రి నారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న మన్ కీ బాత్‌లో బెజవాడలో నీటి సరఫరా నిర్వహణ చాలా బాగుందని ప్రధాని వ్యాఖ్యానించారని తెలిపారు. ప్రధాని వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ అభివృద్ధికి నిదర్శనమని, సీఎం చంద్రబాబు పర్యవేక్షణలో విజయవాడకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కిందన్నారు. అమృత్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో వచ్చే మూడేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

సమర్థవంతంగా తాగునీటి నిర్వహణ

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్ : ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో విజయవాడ నగరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం మనందరికీ గర్వకారణమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పౌరుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా నగరానికి వచ్చిన గుర్తింపునకు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. శాశ్వత అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రభుత్వాల నిబద్ధతకు ఇది అద్దం పడుతుందన్నారు. విజయవాడ నగరంలో నీరు వృథా కాకుండా సమర్థవంతమైన 'స్కాడా' వంటి అత్యాధునిక సాంకేతిక విధానాన్ని కార్పొరేషన్ అనుసరిస్తున్నదని ఎంపీ స్పష్టం చేశారు. కమిషనర్ ధ్యానచంద్రతో పాటు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.




శ్రీధర్ మాస్టర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఆదర్శ ఉపాధ్యాయుడికి సత్కారం

విస్సన్నపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూపర్ టీచర్ శ్రీధర్ మాస్టర్‌కు అంతటా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల క్రితం శ్రీధర్ మాస్టర్ అంకిత భావాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే.. ధనుష్ అనే పేద విద్యార్థికి ప్రాణదానం చేసేందుకు సోషల్ మీడియా వేదికగా శ్రీధర్ మాస్టర్ చేసిన ప్రయత్నం 'ఆంధ్రజ్యోతి' ద్వారా దేశ విదేశాల్లో ప్రతి ఒక్కరికీ చేరింది. ఇటీవల విస్సన్నపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులు మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. సోమవారం జడ్పీ ఉన్నత పాఠశాల నర్సాపురం హెచ్ఎం శోభాలత ఆధ్వర్యంలో మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. నర్సాపురం స్కూల్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చిన శ్రీధర్ మాస్టర్‌ను అభినందించారు.

ఐఐటీ తిరుపతి ఫేజ్-2కు
రూ.2,313 కోట్లు

- ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం



వన్‌టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ తిరుపతి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఫేజ్-2లో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం రూ.2,313.02 కోట్లు మంజూరైనట్టు లోక్‌సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. భారతదేశంలో ఉన్నత సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించిందని, 2014 తరువాత ఏర్పాటైన ఐదు ఐఐటీల విద్యా, మౌలిక సదుపాయాల విస్తరణకు రూ.11,828.79 కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇందులోనే ఆంధ్రప్రదేశ్‌లోని ఐఐటీ తిరుపతి కూడా ఉందన్నారు. ఈ ఐఐటీలలో కేంద్రం 130 కొత్త అధ్యాపక పోస్టులను కూడా ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఐఐటీ తిరుపతిలో 6 బీటెక్ ప్రోగ్రాములు, 13 ఎం.టెక్ కోర్సులు, 3 ఎం.ఎస్.సి కోర్సులు, 1 పబ్లిక్ పాలసీ మాస్టర్స్, 9 విభాగాల్లో పి.హెచ్.డి కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పన లక్ష్యం

[ఆంధ్రజ్యోతి ఎపెక్స్]

సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి పయ్యావుల కేశవ్

- నందిగామలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో టైలర్స్‌తో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్



వేదాద్రికి నిధులు మంజూరుచేయాలని మంత్రిని కోరుతున్న సాగునీటి సంఘాల ప్రతినిధులు

నందిగామ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, పల్లెల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం నందిగామలో రూ.ఏడు కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు శంకుస్థాపన కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మౌలిక వసతులకు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తుందన్నారు. నందిగామను ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

ఆర్థిక పరిస్థితులు సహకరించకున్నా ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలుతో పాటు అభివృద్ధిని ఉరకలు వేయిస్తున్నదని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆయన ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెంచాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంత్రిని కోరారు. నందిగామ సబ్‌ట్రెజరీ కార్యాలయం కొత్త భవనం నిర్మించాలని కోరారు. మండల రీసోర్స్ సెంటర్‌లలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, పీఆర్‌పీలకు వేతనాలు పెంచాలని మంత్రి కి వినతి పత్రం అందజేశారు. ఏడేళ్లుగా వేతనాల పెంపు కోసం పోరాడుతున్నామని, తమకు న్యాయం చేయాలని ఉద్యోగులు కోరారు.

అన్నదాతకు భరోసా..

నందిగామ : 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూశాను.. తప్పకుండా వేదాద్రి ఎత్తిపోతల పథకానికి సాయం అందిస్తాను.. అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నదాతలకు హామీ ఇచ్చారు. సోమవారం పలుకార్యక్రమాల్లో పాల్గొనేందుకు నందిగామ వచ్చిన మంత్రిని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కార్యాలయంలో సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులు కలిశారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే వేదాద్రి ఎత్తిపోతల పథకం ప్రస్తుత పరిస్థితిని వివరించారు. తక్షణం నిధులు అందిస్తే ఖరీఫ్ చివరికైనా నీరు అందుకోగలుగుతామని చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ, వేదాద్రి ఎత్తిపోతలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చదివానని, మహోన్నత వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయి సహకారం అందిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన రూ.15 కోట్లను త్వరలోనే విడుదల చేస్తానని, విద్యుత్ బాకాయిలపై ఆ శాఖతో మాట్లాడి రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలో దెబ్బతిన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలో పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తంగిరాల సౌమ్య, ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, నందిగామ డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, చిరుమామిళ్ల సుబ్బారావు, ఉమ్మినేని విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



దుకాణాలు, గోడౌన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కంచికచర్లరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లాలో సమృద్ధిగా ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సోమవారం కంచికచర్ల చెవిటికల్లు రోడ్డులోని గ్రోమోర్, ప్రైవేటు దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 30,332 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నానో యూరియాను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే భూములు కలుషితం కాకుండా దిగుబడులు పెంచవచ్చన్నారు. జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయపనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ప్రస్తుతం 9,976 మెట్రిక్ టన్నుల యూరియా 2,457 మెట్రిక్ టన్నుల డీఏపీ 1,157 మెట్రిక్ టన్నుల ఎంవోపీ 14,197 మెట్రిక్ టన్నుల ఎస్‌పీకే.. సుమారుగా 30,332 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులు, పురుగులమందులకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించి అన్నదాతలకు గందరగోళానికి గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని, దుకాణాల లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. కంచికచర్లలోని శ్రీ కనకదుర్గా ఎరువుల, పురుగులమందుల దుకాణంతో పాటు గోదాములను, మనగ్రోమోర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్‌తో పాటు ఫిజికల్ స్టేటస్ ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆర్డీవోలు, తహసీల్దార్లు తనిఖీలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎరువులు, పురుగుమందులపై ఫిర్యాదులను 9154970454 నెంబర్‌లో సమాచారాన్ని అందించాలని సూచించారు. రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి సాగు దిశగా వారిని మళ్లిస్తున్నామని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని 15-20 శాతం వరకు తగ్గించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలో అగ్రిటెక్నో అధిక ఆదాయాలు వచ్చే ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ ఆగ్రి ఏడీ శ్రీనివాస్, ఏవో విజయ్‌కుమార్, తహసీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఆయుష్ శాఖ ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అపోహలు తొలగించి ఆయుష్షు పోయండి

- ప్రాచీన వైద్యం దేశ వారసత్వ సంపద
- స్వర్ణాంధ్ర సాకారానికి కలసికట్టుగా అడుగులేద్దాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన వైద్య విధానం దేశ వారసత్వ సంపద అని, ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి (ఆయుష్)పై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించి, ప్రభుత్వాల చొరవ, ఏర్పాట్లను సద్వినియోగం చేసుకొనేలా పోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ ప్రాంగణంలో జిల్లా ఆయుష్ శాఖ అధ్వర్యంలో ఇగ్నైట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యులు పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన వారితో పాటు కలెక్టరేట్ సందర్శకులకు సంప్రదాయ వైద్య విధానాల విశిష్టతను వివరించడంతో పాటు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ద్వారా 130 మందిని పరీక్షించి, ఔషధాలు అందజేశారు. కలెక్టర్ లక్ష్మీశ ఇగ్నైట్ సెల్‌ను సందర్శించి ఆయుష్ వైద్యులకు వివిధ సూచనలు చేశారు. జిల్లాలో ఏడు ఆయుష్మాన్ మందిర్‌లు, ఆరు ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయని, అదేవిధంగా విజయవాడలో డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఉన్నాయని, వీటి ద్వారా మెరుగైన సేవలు అందించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ 2047ను ఆవిష్కరించడం జరిగిందని, ఆరోగ్య ఆంధ్ర సాధనలో ఆయుష్ విభాగం కూడా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఇటీవల యోగా ఔన్నత్యాన్ని ప్రజలందరికీ చేరువచేసి, ఆరోగ్య ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర మాసోత్సవాలు విజయవంతమయ్యాయని, ఇదేస్ఫూర్తితో ఇతర ప్రాచీన వైద్య విధానాలను భావితరాలకు అందించేందుకు సమిష్టిగా అడుగులేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ వై.రత్న ప్రియదర్శిని, డాక్టర్ పి.సుకన్య, డాక్టర్ మొహ్మద్ జునీద్, డాక్టర్ విష్ణువర్ధన్, పీజీ స్కాలర్లు, హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మర్ చాట్‌యాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

ఉద్యాన పంటల సాగులో నూతన ఒరవడి రావాలి

- మైక్రోసాఫ్ట్, డిజిటల్ గ్రీన్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫార్మర్‌చాట్ ప్రాజెక్టు ప్రారంభం

మచిలీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగులో రైతులు సాంకేతికపరంగా నూతన పద్ధతులను తెలుసుకుని, పంటలు సాగు చేయాలని డిజిటల్ గ్రీన్‌ట్రస్ట్ ప్రతినిధి వేముల కమలాకర్ అన్నారు. మైక్రోసాఫ్ట్, డిజిటల్ గ్రీన్‌ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన ఫార్మర్‌చాట్ యాప్‌పై ఉద్యానశాఖ అధికారులు, రైతులకు సోమవారం జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మర్‌చాట్ యాప్‌ద్వారా ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు కృత్రిమమేధస్సు(ఏఐ) ఆధారిత సలహాలు, వాయిస్‌మెసేజ్‌లు, టెక్స్‌మెస్సేజ్‌లు, ఫొటోల రూపంలో సమాచారం అందించడం జరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పులతోపాటు, పంటలకు సంబంధించి మార్కెటింగ్ సదుపాయాలను, పంటలసాగులో పాటించాల్సిన యాజమాన్యపద్ధతులను కూడా తెలియజేస్తామన్నారు. జిల్లా ఉద్యానశాఖ జేడీ జె.జ్యోతి మాట్లాడుతూ, ఫార్మర్‌చాట్‌యాప్‌ను జిల్లాలోని రైతులంతా వినియోగించుకోవాలన్నారు. ఫార్మర్‌చాట్ యాప్‌వలన కలిగే ఉపయోగాలపై ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మొదటి విడతగా 5వేలమంది రైతులను ఈ యాప్‌ను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీ కోసం)లో ప్రజలు ఇచ్చిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి నాణ్యమైన పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం అధికారులతో కలిసి 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి 148అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 26,325 అర్జీలు వివిధ సమస్యలను పరిష్కరించాలని వచ్చాయన్నారు. వీటిలో 22,712 అర్జీలు పరిష్కారమయ్యాయని తెలిపారు. భూమి రికార్డులు, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ విభాగాల అధికారులు అర్జీలను చూడకుండా, పరిష్కరించకుండా ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా శకటాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కోర్టుధిక్కరణ కేసులకు సంబంధించి 48 కౌంటర్‌ఫైళ్లు దాఖలు చేయాల్సి ఉండగా, 11మాత్రమే దాఖలు చేశారని, మిగిలిన వాటిని వెంటనే దాఖలు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏఎస్పీ సత్యనారాయణ, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతి, మెప్మా పీడీ సాయిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, అధికారులు

మళ్లీ ఆశలు

(5వ పేజీ తరువాయి)

విమాన సర్వీసు నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారు. వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. దీనిద్వారా సగం ప్రయాణికులు లేకపోతే ఆ నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వీజీఎఫ్ విధానంలో భరిస్తుంది. అంతకుముందే ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ఏడీసీఎల్).. సింగపూర్‌కు విమానయాన సర్వీసుకు సంబంధించి ఆన్‌లైన్ సర్వే కూడా నిర్వహించింది. ఈ సర్వే అనుకూలంగా రావడంతో వీజీఎఫ్ విధానంలో ఇండిగో ద్వారా సింగపూర్‌కు సర్వీసు నడపాలనుకున్నారు. 2018, డిసెంబరు 3న నాటి ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ సర్వీసును ప్రారంభించారు. 90 శాతం ఆక్యుపెన్సీతో నడిచేది. విజయవాడ-సింగపూర్ మధ్య కేవలం రూ.9,500 చార్జీ ఉండేది. సింగపూర్ వెళ్లినవారు ప్రపంచంలోని ఏ దేశం నుంచి ఏ దేశానికైనా విమానంలో చేరుకునే అవకాశం ఉండేది. దీంతో గల్ఫ్, ఇతర ప్రపంచ దేశాల్లో ఉన్నవారంతా సింగపూర్ వచ్చి, అక్కడి నుంచి విజయవాడ వచ్చేవారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం, ఉభయగోదావరి, ఖమ్మం జిల్లాల నుంచి విదేశాలకు రాకపోకలు సాగించేవారు. అంతర్జాతీయ హోదా వచ్చిన తర్వాత విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మొట్టమొదటగా నడిచిన అంతర్జాతీయ విమాన సర్వీసుగా ఇది నిలిచింది. వీజీఎఫ్ విధానం అవసరం లేకుండానే పోయింది. ఈలోపు ఎన్నికలు వచ్చాక.. అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వం సింగపూర్ విమాన వీజీఎఫ్ విధానాన్ని ఉపసంహరించుకుంది. దీంతో ఇండిగో విమానయాన సంస్థ సింగపూర్‌కు సర్వీసును రద్దు చేసింది. ఇప్పటి వరకు సింగపూర్‌కు విమాన సర్వీసు అనేది లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ సర్వీసును పునరుద్ధరిస్తారన్న చర్చ సాగింది. సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో అక్కడి వారు విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు డైరెక్ట్ విమానాలను నడపాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించడంతో ఈ సర్వీసుపై మళ్లీ ఆశలు ఏర్పడ్డాయి.

టెండర్ల ట్రాక్‌లోకి..

(5వ పేజీ తరువాయి)

17వ తేదీ వరకు ఔత్సాహిక కాంట్రాక్టు సంస్థల నుంచి బిడ్లను స్వీకరిస్తారు. 17.. బిడ్లను సమర్పించటానికి ఆఖరి రోజు. అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ఏపీఎంఆర్‌సీఎల్ టెండర్లను తెరిచి కాంట్రాక్టు సంస్థను ప్రకటిస్తుంది. ఈ 45 రోజుల సమయంలో కాంట్రాక్టర్లతో పలుమార్లు ప్రీబిడ్ మీటింగ్స్ నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో కాంట్రాక్టర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు టెండరు నోటిఫికేషన్‌ను సవరించే అవకాశం ఉంటుంది. టెండర్లు తెరిచి కాంట్రాక్టు సంస్థకు అప్పగించినప్పటి నుంచి 30 నెలలు అంటే.. రెండున్నరేళ్లలో విజయవాడ మొదటి దశ మెట్రో కారిడార్లను పూర్తి చేయాలి. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ పనులు మాత్రం రెండేళ్లలో పూర్తి చేయాలి.

మొదటి దశలో 33 మెట్రో స్టేషన్ల నిర్మాణం

మొదటి దశలో గన్నవరం బస్‌స్టేషన్ నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు రింగ్‌రోడ్డు.. అక్కడి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్‌ను కలుపుతూ పీఎన్‌బీఎస్ వరకు 25.95 కిలోమీటర్ల మేర కారిడార్-1 పనులు చేపట్టాలి. ఇందులో భాగంగా గన్నవరం బస్టేషన్, గన్నవరం సెంటర్, యోగాశ్రమం, ఎయిర్‌పోర్టు, కేసరపల్లి, వేల్పూరు, గూడవల్లి, శ్రీచైతన్య కాలేజీ, నిడమానూరు రైల్వేస్టేషన్, నిడమానూరు, ఎనికేపాడు, ఎంటీటీ సెంటర్, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, గుణదల, పడవలరేవు, మాచవరం డౌన్, సీతారామపురం సిగ్నల్, బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్ (ఈస్ట్), రైల్వేస్టేషన్ (సౌత్) మెట్రో స్టేషన్ల నిర్మాణంతో పాటు పీఎన్‌బీఎస్ దగ్గర ప్రధాన మెట్రో స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంటుంది. అలాగే, పెనమలూరు నుంచి బందరు రోడ్డు మీదుగా 12.45 కిలోమీటర్ల పొడవున కారిడార్-2లో పెనమలూరు, పోరంకి, తాడిగడప, కానూరు సెంటర్, కృష్ణానగర్, అశోక్‌నగర్, ఆటోనగర్, బెంజిసర్కిల్, టిక్కిల్ రోడ్డు, ఐజీఎంసీ స్టేడియం, విక్టోరియా జూబ్లీ మ్యూజియం, పీఎన్‌బీఎస్ మెట్రో స్టేషన్ల నిర్మాణం చేపట్టాలి.

11 అలంకారాల్లో అమ్మ దర్శనం

(5వ పేజీ తరువాయి)

వారికి ఈతి బాధలు నశిస్తాయని, కోరిన కోర్కెలు తీరుతాయని, వివాహాలు జరుగుతాయని నమ్మిక. దీంతో కాత్యాయినీ అవతారానికి ప్రాశస్త్యం ఏర్పడింది. కాగా, 26వ తేదీ కూడా చవితి తిథి మధ్యాహ్నం దాటి ఉండటంతో ఆరోజు అమ్మవారు యథావిధిగా మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తారు. దీనివల్ల ఒకే తిథిలో రెండు అలంకారాలను దర్శించుకునే భాగ్యం భక్తులకు కలుగుతుంది. బాలాత్రిపుర సుందరీదేవి, గాయత్రీదేవి, అన్నపూర్ణాదేవి అలంకారాల అనంతరం నాల్గో అలంకారంగా కాత్యాయినీదేవి, ఐదో అవతారంగా మహాలక్ష్మీదేవిని దర్శించుకోవచ్చు.

రియల్ మోసం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారని, భీమవరపు సాంబిరెడ్డి అనే వ్యక్తికి వ్యయసాయ భూమిగా ఎలా అమ్మారని, దానికి రిజిస్ట్రేషన్ల శాఖ ఎలా అంగీకరించిందని ప్రశ్నించారు. వ్యవసాయేతర భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం రెవెన్యూ తప్పిదంగా భావించి ఆ పాసు పుస్తకాలను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపానని, ప్లాట్లను అప్పగించడం వంటి విషయాలు రెవెన్యూ పరిధిలోకి రావని మురళీకృష్ణ వారికి చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం, అమ్మడం చేస్తూ మోసం చేస్తున్నారని కొనుగోలు చేసే ముందు అన్ని విషయాలు పరిశీలించాలని హితవు పలికారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475	



ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు: ఏవో

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులను సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని, మోతాదుకు మించి ఎరువులు వాడకుండా సద్వినియోగం చేసుకోవాలని ఏవో బి. రంగనాథ్‌బాబు సూచించారు. వీరవల్లి, రంగన్నగూడెం పీఏసీఎస్‌ల ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీ, నిల్వలు, రికార్డులను సోమవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.





అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ఏ.వై.రావు, సిబ్బంది

సిద్ధార్థలో హెపటైటిస్‌పై అవగాహన

విజయవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ చేసిన ఆహారం తినకుండా ఉండడం, రక్త బదిలీ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు టీకాల ద్వారా వైరల్ హెపటైటిస్, కాలేయ క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడవచ్చని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏ.వై.రావు తెలిపారు. సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎస్‌పీఎం విభాగం ఆధ్వర్యంలో హెపటైటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైరల్ హెపటైటిస్ వ్యాప్తి, వైద్యపరీక్షలు, చికిత్స, స్క్రీనింగ్, నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య విద్యార్థులకు హెపటైటిస్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలమ, అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఎస్‌పీఎం విభాగ అధిపతి డా.గోవింద, అధ్యాపక బృందం, విద్యార్థులు హాజరయ్యారు.

ఆరోగ్యబీమాపై వృద్ధుల అనాసక్తి

పెనమలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య బీమా పొందేందుకు వృద్ధులు తగినంత శ్రద్ధ చూపించడం లేదని బీమా తీసుకోవడం చాలా తక్కువగా ఉందని లాన్సెట్ అధ్యయన ప్రధాన రచయిత, ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బ్రిజేష్ టక్కర్, మరో రచయిత డాక్టర్ రాజ్‌నారాయణ్‌లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాటరాక్ట్ చికిత్స తర్వాత బీమా లేకపోవడం వల్ల దృశ్యమాన్యత తగ్గుతుందని , పరిశోధనలో ప్రతి 20మంది వృద్ధులలో ముగ్గురికి మాత్రమే ఆరోగ్యబీమా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం కవరేజి ఉన్నప్పటికీ 80ఏళ్ల పైబడిన వారు బీమా తీసుకోవడంలో అశ్రద్ధ కనబరుస్తున్నట్లు అధ్యయనం తెలిపిందన్నారు. ఆయుష్మాన్ వంటి ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా బీమా తీసుకోవడాన్ని గణనీయంగా పెంచాయని, ఇది ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ సానుకూలతను ప్రదర్శించడమేనన్నారు. ప్రభుత్వ బీమా రోగులు చికిత్స కోసం అనుమతి రావడం కోసం కొద్ది రోజులు వేచి ఉండాల్సిన సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.

దోచుకోడానికి దారులు!

- మెరకపేరుతో రోడ్డుపై రోడ్డు
- డ్రెయిన్ తవ్వకంపై అశ్రద్ధ
- లక్షల్లో ప్రజాధనం వృథా
- కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్న నగర పంచాయతీ పాలకవర్గం
- ఆశ్చర్యపోతున్న స్థానికులు


ఫెూరీ మసీదు సమీపాన వార్డు సచివాలయం వద్ద సీసీ రోడ్డుపై నిర్మిస్తున్న సీసీ రోడ్డు.. ప్రొక్లెయిన్‌తో పగులగొడుతున్న సీసీ రోడ్డు .. ఇప్పటికే ఉన్న సీసీ రోడ్డు

ఉయ్యూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో ప్రజాధనం పెద్దయెత్తున వృథా అవుతుంది. రోడ్లపైన రోడ్లు, అంతర్గత రోడ్ల వెడల్పు పేరుతో లక్షల రూపాయల ప్రజాధనం కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ పాలకవర్గం వృథా చేస్తుంది. ప్రతిపక్ష కౌన్సిలర్లు నోరెత్తకుండా లోబరుచుకుని కౌన్సిల్‌లో నామ్‌కే వాస్తేగా అజెండాలోని అంశాలు ఆమోదింప చేసుకుని పనులు చక్కబెడుతూ నగర పంచాయతీకి మంజూరైన ధనం యథేచ్ఛగా ఖర్చుపెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పాత స్టేట్‌బ్యాంక్ రోడ్డు నుంచి, 9వ వార్డు సచివాలయం, ఫెూరీ మసీదువైపు వెళ్లే సీసీ రోడ్డుపై రూ. 16 లక్షలతో మరలా సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణం చేస్తున్నారు. పాత సీసీ రోడ్డు చెక్కు చెదరకుండా ఉన్నప్పటికి పల్లమై నీరు నిలుస్తుందన్న సాకుతో రోడ్డుపై రోడ్డు వేస్తున్నారు. రోడ్డుపక్క సైడ్‌లో మెరకగా ఉంటంవల్ల రోడ్డుపై ఓచోట నిలుస్తున్న వర్షపు నీటిని పక్క డ్రెయినేజిలోకి పోయేలా రోడ్డుపక్కన మెరక తొలగించాల్సింది పోయి లక్షలు ఖర్చుచేసి రోడ్డుపై రోడ్డు వేయడం ఏమిటని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- కోడూరుపాడు, ఉమామహేశ్వరపురంలో సుపరిపాలనలో తొలి అడుగు


మహిళకు కరపత్రాన్ని అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కోడూరుపాడు, ఉమామహేశ్వరపురం, శోభనాద్రిపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు, మహిళలు భారీ గజమాలతో హారతులిచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు, రైతులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ఎరువుల అందుబాటు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహించి స్థానిక సమస్యలపై ఆరా తీసారు. అంతర్గత రహదారుల మరమ్మతులు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారంపై అక్కడిక్కడే అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన స్ఫూర్తితోనే నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు కూడా సహకరించి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, చిరుమామిళ్ల సూర్యం, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, మొవ్వా వేణుగోపాల్, గండేపూడి నితీష్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, వెంకన్న, మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, పాండురంగారావు, అమృతపల్లి సూర్యనారాయణ, గోవిందయ్య పాల్గొన్నారు.

వీరవల్లిలో

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమమని ఉప సర్పంచ్ లంక అజయ్ అన్నారు. వీరవల్లిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో కూడిన కర పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు వడ్లపూడి రమేష్, యూనిట్ కో-ఇన్‌చార్జి వల్లూరి శివనాగమల్లేశ్వరరావు, ఈలప్రోలు నళినీకాంత్, ధర్మవరపు వెంకట్రావు, వేగుంట మల్లికార్జునరావు, రాయి మల్లికార్జునరావు, బుగ్గ శివ, లింగంనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డెక్క, తూడు తొలగింపు పూర్తి

ఉంగుటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ వరినాట్లు, కలుపుతీత పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా వుండేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుడమేరులో నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంకిగా మారిన గుర్రపు డెక్క, తూడులను తొలగించే పనులను ఇటీవల ప్రొక్లెయిన్లు, ఎక్స్‌కవేటర్ల సాయంతో చేపట్టిన అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. సాగునీటిని చివరి పంట పొలాల వరకు సమృద్ధిగా అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కాలువల ప్రక్షాళన చేపటి తరిగొప్పల, వేంపాడు, ఉంగుటూరు, కొయ్యగూరపాడుల్లో బుడమేరు కాజ్‌వేల వద్ద దట్టంగా అల్లుకుపోయిన డెక్క, తూడు తొలగింపు చర్యలు చేపట్టింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొట్టిపాటి వెంకటకృష్ణ (59) విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై వి. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడుకు చెందిన మృతుడు ఈ నెల 26న స్థానిక నూజివీడు రోడ్డులో నడిచి వెళుతుండగా మినీ వ్యాన్ ఢీ కొంది. తీవ్ర గాయాలవ్వగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.


కాటూరు పీఏసీఎస్ చైర్మన్ గుర్రం చంద్రశేఖర్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైవీబీ రాజేంద్రప్రసాద్

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలందించి, పేరు ప్రఖ్యాతులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ, అభివద్ధి పథకాలు సద్వినియోగం అయ్యేలా కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కాటూరులో విఘ్నేశ్వర కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొని చైర్‌పర్సన్ గుర్రం చంద్రశేఖర్, డైరెక్టర్లు సాంబశివరావు, ధనకోటి బాలకోటేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు కుటుంబరావు, పార్టీ నాయకులు పోతురాజు, శ్రీనివాసరావు, శరత్, రవి, ఎంపీటీసీలు అనూష, శ్రీలక్ష్మి, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, మండల అధ్యక్షుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

కలవపాములలో సీఎస్ఆర్, హడ్కో నిధులు రూ. 70లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రభుత్వ పతనం ఖాయం

ఐక్యవేదిక నాయకులు

పెనమలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో తెచ్చిన స్మార్ట్ మీటర్ల వ్యవస్థను, ట్రూఅప్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెనక్కు తీసుకోని పక్షంలో కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో తాడిగడప మునిసిపల్ ప్రాంత విద్యుత్ వినియోగదారుల ప్రజా సదస్సు స్థానిక కార్మిక భవనం వద్ద సోమవారం నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వై నరసింహరావు మాట్లాడుతూ, ట్రూఅప్ చార్జీల వల్ల ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే స్మార్ట్ మీటర్లు పుండు మీద కారం జల్లిన విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎస్‌కే కాసిం అధ్యక్షతన జరిగిన సభలో మున్నంగి నరసింహరావు, మోతుకూరి అరుణ్‌కుమార్, మాగంటి హరిబాబు, పంచకర్ల రంగారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : విద్యుత్ చార్జీల రూపంలో అదనపు భారం మోపి, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకునేందుకు పూనుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పార్టీలకతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. ఆగస్టు 5న విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనలలో ప్రజలందరూ సంఘటితంగా సంతకాలు, వినతిపత్రాలతో తరలిరావాలని కోరారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపుపై ప్రజలను చైతన్యపరుస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఉంగుటూరు ప్రధాన సెంటర్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావూరి బద్రు, జుజ్జువరపు రంగారావు, ఎం.సత్యానారాయణ, కృష్ణ, రంగారావు, లక్ష్మణ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వై నరసింహరావు


కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

గోదాదేవికి విశేష పూజలు

గన్నవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఉపాలయంలో గోదాదేవి అమ్మవారికి తిరునక్షత్రం సందర్భంగా సోమవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం 27 లీటర్ల గోక్షీరముతో, పంచామృతాలతో, వివిధ రకాల పండ్ల రసాలతో స్నపన తిరుమంజనం చేశారు. భక్తులు సామూహిక కుంకుమార్చన జరిపారు. తిరుప్పావై ప్రబంధ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు విశేష పూజలు జరిపారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొనగా తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కానూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్ సోమవారం ఉదయం కానూరులోని సనత్‌నగర్ నుంచి మన కల్యాణ మండపం వరకు పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు, పూడికుపోయిన డ్రెయినేజీని పరిశీలించి సిబ్బందితో చెత్త తీయించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్థానికులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

కానూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మహదేవపురం కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ తులసీనగర్, సనత్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా కానూరు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ ఈఈ పి. హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటకాలువ రోడ్డు, తులసీనగర్, సనత్‌నగర్, మహదేవపురం కాలనీ, వరలక్ష్మిపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉయ్యూరు : కాటూరు, నందమూరు సబ్‌స్టేషన్లలో 33కేవీ కొత్తలైన్ ఏర్పాటు చర్యలు చేపట్టారు. ఈ కారణంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు.

సకాలంలో ఎరువులు అందించండి

కంకిపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు సకాలంలో పంపిణీ చేయాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి వి. శివశంకర్ అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని పది సొసైటీల్లో మాత్రమే ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. సొసైటీల్లో ఉన్న ఎరువులను పెత్తందారులకు కట్టపెట్టకుండా చిన్న సన్నకారు రైతులకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు తాడంకి నరేష్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రసాదంపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనికేపాడు జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. గుడ్లవల్లేరు మండలం కౌతవరానికి చెందిన శ్రీనివాసరావు(29) కొత్త ఆటోనగర్‌లోని యూపీవీసీ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. తోటి ఉద్యోగి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై రామవరప్పాడు నుంచి ఎనికేపాడు కంపెనీ వసతికి వెళ్లే క్రమంలో ఎనికేపాడు జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా గన్నవరం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్‌కు తీవ్రగాయాలయ్యాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఉంగుటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆత్కూరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ వివరాల ప్రకారం.. పెదఅవుటపల్లి హైవే అండర్‌పాస్‌లో ఆదివారం మధ్యాహ్నం మతిస్థిమితం లేని వ్యక్తి మూర్ఛవచ్చి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి గురించి తెలిసిన వారు ఆత్కూరు ఎస్సై 9491152837 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం

కంకిపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : లయన్ బొట్టా వెంకట రమణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని కంకిపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షులు యుగంధర్ అన్నారు. బొట్టా వెంకటరమణ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కంకిపాడులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు జ్యోతి, బండి నాంచారయ్య, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

దొంగ సర్టిఫికెట్లతో పదోన్నతులు!

● హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతుల వెనుక కిరికిరి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అర్హత లేకపోయినా.. హెల్త్ అసిస్టెంట్లుగా అందలం ఎక్కించాలనుకున్న కార్పొరేషన్ అధికారుల అవినీతి బండారం బయట పడింది. హెల్త్ అసిస్టెంట్లకు ఎంపిక చేసిన వారిలో కనీస విద్యార్హతలు లేని వారున్నారని నిగ్గుతేలింది. ఇటీవల దొడ్డిదారిన పారిశుధ్య కార్మికులు కొందరికి అర్హతలు లేకపోయినా పదోన్నతులు కల్పించేందుకు అధికారులు ఫైల్‌ను సిద్ధం చేయటంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర విచారణకు ఆదేశించారు. దీంతో సీఎంవోహెచ్ నేతృత్వంలో విచారణ ప్రారంభించారు. పారిశుధ్య కార్మికుల నుంచి వేలాది రూపాయలను వసూలు చేసి వారికి ప్రమోషన్లు కల్పించేందుకు కొందరు అధికారులు సిద్ధమయ్యారు. వారు ప్రతిపాదించిన 9 మందిలో ముగ్గురికి కనీస విద్యార్హతలు లేవని తేలింది. వీరి సర్టిఫికెట్లు నకిలీవని తేలింది. పారిశుధ్య కార్మికులకు లేనిపోని సలహాలిచ్చి దొంగ సర్టిఫికెట్లతో పదోన్నతి కల్పించేందుకు స్కెచ్ వేసినట్టు తేలింది. మిగిలిన ఆరుగురి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది.



డాక్టర్ హరికుమార్‌కు రికగ్నేషన్ మెమోను అందజేస్తున్న జిల్లా గవర్నర్

ప్రజాసేవకు గుర్తింపు.. రికగ్నేషన్ మెమో అందజేత

గాంధీనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు వైద్య సేవలందిస్తున్న లయన్ డాక్టర్ చల్లా హరికుమార్‌కు రికగ్నేషన్ మెమోను అందజేశారు. లయన్ ఇంటర్నేషనల్ 316 డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వీవీపీఎస్ ఆంజనేయులు ఆయన ఆసుపత్రిలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరికుమార్ సేవలను గుర్తించి మెమోను అందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు వైద్య సేవలందిస్తూ వారి మన్ననలు పొందాలని ఆంజనేయులు ఆకాంక్షించారు. లయన్ సభ్యులు శ్రీరామ్ పవన్, హెల్పింగ్ హ్యాండ్ కేరింగ్ సౌల్స్ టీం నవ్యకృష్ణ, అశోక్, దిలీప్, కుమార్ పాల్గొన్నారు.

రైల్వే టీసీ ఉద్యోగం పేరుతో మోసం

● అనంతపురం జిల్లా మహిళపై వంచన కేసు

జగ్గయ్యపేట, జూ మలై 28 (ఆంధ్రజ్యోతి): రైల్వే టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన అనంతపురానికి చెందిన మహిళపై జగ్గయ్యపేట ఎస్సై జీ రాజు సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సీతారాంపురానికి చెందిన చవట రాఘవేంద్రరావు (42) ఒక న్యాయవాది వద్ద కేసు నిమిత్తమై వెళ్లాడు. అక్కడ అనంతపురం జిల్లా కోర్టు వీధికి చెందిన జక్కా లక్ష్మీ పరిచయమైంది. ఈ నేపథ్యంలో రైల్వే టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అడ్వాన్స్‌గా రూ.2.5 లక్షలు గత ఫిబ్రవరిలో తీసుకుంది. అప్పటి నుంచి ఎన్నిసార్లు సంప్రదించినా ఉద్యోగం గురించి మాట్లాడటం లేదని, తాను మోసపోయానని గ్రహించిన రాఘవేంద్ర ఎస్సై రాజును కలిసి లక్ష్మీపై ఫిర్యాదు చేయగా, చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం

● ఆసుపత్రిలో చేరిన బాధితుడు

తిరువూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎ.కొండూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కాంతారావు తనపై కొందరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరువూరులో ఉంటున్న ఆయన ఇంటి నుంచి బైటకు వస్తుండగా, మేకల రవి, అతడి అనుచరులు రాడ్డుతో దాడిచేశారని, వారి నుంచి తాను తప్పించుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కానిస్టేబుల్‌కు బొటన వేలు, కడుపులో దెబ్బలు తగలడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేరాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ తెలిపారు. గతంలోనూ రవి తనను ఇబ్బందులు పెడుతున్నట్టు ఆరోపిస్తూ కాంతారావు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి విజయవాడలో చికిత్స పొంది కోలుకున్నాడు. ఇప్పుడు దాడికి గురైనట్టు కేసు నమోదైంది.

దుర్గగుడి వైదిక కమిటీలోకి మరో ఇద్దరు

ఇంద్రకీలాద్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ప్రస్తుతం ఉన్న ఆరుగురు వైదిక సిబ్బందికి అదనంగా మరో ఇద్దరిని నియమిస్తూ ఈవో శీనానాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానాచార్యుడు వీ శివప్రసాద్ శర్మతో పాటు ప్రధాన అర్చకుడు ఎల్ దుర్గాప్రసాద్, వేద పండితులు సీ హెచ్ ఆంజనేయ ఘనాపాటి, వీ శ్యావస్య మహర్షి, ప్రధాన అర్చకుడు వై మల్లేశ్వర శాస్త్రి, ఉప ప్రధాన అర్చకుడు కేఎస్‌వీడీఎం ప్రసాద్ వైదిక కమిటీలో ఉండగా, వీరితో పాటు అదనంగా వేద పండితుడు ఎం షణ్ముఖేశ అవధాని, అర్చకుడు వీ శ్రీధర్ శర్మను నియమించారు. వైదిక కమిటీ దేవస్థానంలో జరిగే అన్ని వైదిక కార్యక్రమాలు, ముహూర్త నిర్ణయాల్లో, ఈవో కోరిన అంశాల్లో సలహాలివ్వటం వంటి విధులు నిర్వహిస్తారు.

ఆక్రమణలు తొలగించాలి



పీఎస్‌ఐకి ఫిర్యాదు అందజేస్తున్న బాపయ్య చౌదరి, మోహనరావు

గుడ్లవల్లేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరులో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి వెంబడి, సంత బజార్‌లో జడ్పీ రహదారి వెంబడి, పై వంతెనపై నున్న ఆక్రమణలను తొలగించాలని తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి సోమవారం తహసీల్దార్ లోకరాజు, గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఇటువంటి ఆక్రమణల కారణంగా రహదారి కుచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులకు దారితీస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆకతాయిలను అదుపుచేయండి

పై వంతెనపై రాత్రివేళల్లో జరుగుతున్న అసాంఘిక చర్యలను అరికట్టాలని పోలీసులకు ఆయన మరో ఫిర్యాదు సమర్పించారు. ఇటీవల కొందరు అరాచక వ్యక్తులు మద్యం, మాదకద్రవ్యాలు సేవించి రాత్రి సమయంలో వంతెన వద్దకు చేరి అల్లర్లు చేయడం, కేకలు వేస్తూ వంతెనపై ప్రయాణించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ముఖ్యంగా మహిళలు ప్రయాణించేటపుడు వీరి వికృత చేష్టలకు భయభ్రాంతులకు గురవుతున్నారని కొందరు ప్రయాణికులు తమ దృష్టికి తెచ్చినట్టు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

'గులకరాయి' సతీష్ దొరికాడు!

● తిరుపతి నుంచి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగింత

విజయవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో గత ఎన్నికలకు ముందు అప్పటి సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కేసులోని నిందితుడు వేముల సతీష్ ఆచూకీని అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కనుగొన్నారు. అతడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 17న సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. సతీష్ ఓ బాలికను ప్రేమించిన విషయం ఇంట్లోవాళ్లకు తెలిసి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, అతడి కోసం పది ప్రత్యేక బృందాలు నియమించారు. సతీష్ తొలుత తిరుపతి వెళ్లాడు. రెండు రోజుల తర్వాత కడప జిల్లా ఒంటిమిట్టకు చేరుకున్నాడు. డబ్బులు అయిపోవడంతో ఖమ్మంలోని తండ్రి దుర్గారావుకు ఫోన్ చేశాడు. సతీష్ సూచించినట్లు ఓ వ్యాపారి నంబరుకు యూపీఐ ద్వారా రూ.1500 పంపాడు. ఫోన్ చేసి లొకేషన్ ట్రేస్ చేసిన పోలీసులు అక్కడికి వెళ్లేసరికి సతీష్ తిరుపతి చేరుకున్నాడు. తిరుపతి తూర్పు స్టేషన్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విజయవాడ పోలీసు అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

దండాలు పెడితేనే పనిచేస్తారా..?

తహసీల్దార్లపై కలెక్టర్ కన్నెర్ర ● వాడివేడిగా సాగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ● పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వడంలో జాప్యం చేస్తున్న ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌పై ఆగ్రహం

విజయవాడ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల, గ్రామాల్లో పనిచేసే రెవెన్యూ అధికారుల పనితీరు ఏ మాత్రం బాగోలేదు. ప్రజాసమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల అర్జీలు పెరిగిపోతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ 19 శాతానికి పడిపోయింది. దండాలు పెట్టిన వారికే పట్టాదార్ పాస్ పుస్తకాలిస్తారా అంటూ వీఆర్వో, తహసీల్దార్‌పై కలెక్టర్ జీ లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేయడం ఈ దుస్థితికి నిదర్శనగా కనిపిస్తోంది. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి వారం రెవెన్యూ సమస్యలపై అర్జీలు పెరుగుతుండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకం కోరుతూ మధ్యాహ్నం 1.30కు ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన అర్జీని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. 1983లో అప్పటి ప్రభుత్వం వక్ఫ్ భూములకు బహిరంగ వేలం నిర్వహించిందని, ఈ వేలంలో పాల్గొన్న వ్యక్తులు భూములను కొనుగోలు చేశారని, సదరు భూములు ఇప్పటికే రెండు మూడు చేతులు మారాయని గ్రహించారు. అక్కడ 1.30 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి, తనకు పాస్ పుస్తకం ఇవ్వకుండా తహసీల్దార్ ఇబ్బంది పెడుతున్నారని కలెక్టర్‌కు వివరించాడు. వెంటనే వర్చువల్‌గా సమావేశానికి హాజరైన తహసీల్దార్ వై వెంకటేశ్వర్లును కలెక్టర్ నిలదీశారు. పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసి ఏడాది గడుస్తుందని, ఎందుకు మంజూరు చేయాలేదు.. ఈ ఏడాది మార్చిలో తనకు అర్జీ ఇచ్చారని, నేను స్వయంగా చెప్పినా పాస్ పుస్తకం ఇవ్వకపోవడంతో మళ్లీ ఇప్పుడు అర్జీ ఇచ్చారని, అసలు పాస్ పుస్తకం ఇవ్వకపోవడానికి కారణమేమిటని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఆ భూమి వక్ఫ్ భూమి కాదని రికార్డుల్లో స్పష్టంగా ఉన్నా మంజూరుకు మీకు వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నించారు. మీ చుట్టూ తిరిగి దండాలు పెడితేనే పాస్ పుస్తకం ఇస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేయడం ఇష్టం లేనివారు వెళ్లిపోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వ పథకాలను అందజేయాలని, తల్లికి వందనం, వితంతు, వికలాంగ పింఛన్లను మంజూరు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల అర్జీ ఇచ్చారు. తల్లికి వందనం నగదు తమకు రాలేదని 34 మంది అర్జీ ఇచ్చారు. పట్టాదార్ పాస్ పుస్తకం కోసం 60 మంది, భూముల సర్వేకు 8 మంది, ఉపాధి కోసం ముగ్గురు, విద్యుత్ సమస్యలు పరిష్కారానికి ఇద్దరు అర్జీలిచ్చారు. పోలీస్ శాఖకు 17, అటవీ శాఖకు 10, పంచాయతీరాజ్‌కు 9, వైద్య శాఖకు 6, బీసీ కార్పొరేషన్‌కు 3, మార్కెటింగ్ శాఖకు 3, డీఆర్‌డీఏకు 2, ఇంటర్ బోర్డుకు 2, రిజిస్ట్రేషన్‌కు 2, మత్స్య శాఖకు 2, పౌర సరఫరాల శాఖకు 7, ఇతర శాఖలకు సంబంధించి 22 అర్జీలు వచ్చాయి. జేసీ ఎస్ఇలక్కియా, డీఆర్‌డీఏ పీడీ ఏఎస్‌వీ నాంచారరావు, ఏసీపీ వెంకటేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి జ్యోతి పాల్గొన్నారు.





అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అదే మోసం.. పదే పదే

● డాక్టర్ నమ్రతకు విజయవాడలోనూ కేంద్రం ● యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో కార్యకాలపాలు ● పోలీసులకు చిక్కిన తర్వాత మాయమైన యూనివర్సల్ ● కేంద్రంలో వైద్య బృందం సోదాలు





గాయత్రి నగర్‌లో ఉన్న ఫెర్టిలిటీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: హైదరాబాద్‌లో సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ పచ్చిపాల నమ్రత అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నగరంలోని గాయత్రి నగర్‌లో 'యూనివర్సల్ హెల్త్ క్లీనిక్' పేరుతో నమ్రత కేంద్రాన్ని తెరిచారు. ఈ కేంద్రానికి అనుమతులను యూనివర్సిల్ పేరుతో తీసుకున్నారు. బోర్డులు మాత్రం యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నమ్రత నడిపే కేంద్రాలకు సృష్టిని జోడించారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా వివిధ వ్యక్తుల నుంచి వీర్యాన్ని సేకరించి భద్రపరిచినట్టు ఆరోపణలున్నాయి. గతంలో సూర్యరావుపేటలో సృష్టి పేరుతో సంతాన సాఫల్య కేంద్రం తెరిచారు. ఇప్పుడు హైదరాబాద్‌లో జరిగినట్టే గతంలో ఇక్కడా జరగడంతో అనుమతిని రద్దు చేశారు. తర్వాత నమ్రత మెడికల్ కౌన్సిల్ విచారణను ఎదుర్కొన్నారు. ఇది జరిగిన కొన్నాళ్లకు యూనివర్సల్ పేరుతో గాయత్రి నగర్‌లో బ్రాంచ్‌ను తెరిచారు. ఆయా అనుమతులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎం సుహాసిని, డీపీఎంవో డాక్టర్ పీ నవీన్, రేడియాలజిస్ట్ డాక్టర్ పర్వతేశ్వరరావు, పెథాలజిస్ట్ డాక్టర్ విజయశ్రీ, గైనకాలజిస్ట్ డాక్టర్ కేశవచంద్ర, కృష్ణారావు, వాసవ్య ఎన్జీవో ప్రతినిధి డాక్టర్ రేష్మి సోమవారం పరిశీలించారు. నమ్రతకు ఇక్కడ ప్రత్యేక చాంబర్ ఉంది. అలాగే మరో ఇద్దరు గైనకాలజిస్ట్‌లకు చాంబర్లున్నాయి. అధికారులు పరిశీలించే సమయంలో ఇక్కడ ఒక ఉద్యోగి మాత్రమే ఉన్నాడు. ఫార్మసీ, లైసెన్స్, జీఎస్టీకి సంబంధించిన సర్టిఫికెట్లను ఆయన అధికారులకు చూపించాడు. లోపలున్న ల్యాబ్, ఇతరత్రా విభాగాల తనిఖీకి అవకాశం లేకుండా పోయింది. సిబ్బంది ముందుగానే తాళాలు వేసుకుని పరారయ్యారు. ప్రభుత్వమే అనుమతులను జారీ చేసిందని, ఇతరత్రా విషయాలపై విచారణ చేయాలని కమిటీ సభ్యులు తెలిపారు.

నోటీసులు జారీ

అధికారుల బృందం తనిఖీలకు వెళ్లినప్పుడు గదులన్నింటికీ తాళాలు వేసి ఉండడంతో అక్కడున్న ఉద్యోగికి నోటీసు ఇచ్చారు. యూనివర్సల్ హెల్త్ కేర్ పేరుతో అనుమతులు తీసుకుని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయడాన్ని అధికారులు గుర్తించారు. ఇదే అంశాన్ని నోటీసులో పేర్కొన్నారు. పైగా నర్సింగ్ సిబ్బంది, డ్యూటీ డాక్టర్లు లేకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ సెంటర్‌కు సంబంధించిన అన్ని రికార్డులు, అనుమతులతో వారం రోజుల్లోగా హెల్త్ కమిషనర్ ఎదుట విచారణకు హాజరవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

బ్రహ్మం గారి జెండా పండుగకు వేళాయె!

● రెండు జెండా పండుగలకు ముస్తాబవుతున్న ఈడుపుగల్లు



బ్రహ్మంగారి జెండా ఆవిష్కరణకు ముస్తాబు అవుతున్న ఈడుపుగల్లు ధ్వజస్తంభం

గవర్నర్‌పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆగస్టు నెల వచ్చిందంటే మువ్వన్నెల జెండా పండుగ సందడి నెలకొంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నెల కావడంతో ఆగస్టు 15న దేశం మువ్వన్నెల జెండాలతో మురిసిపోతుంది. కానీ కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామం మాత్రం ఆగస్టులో రెండు జెండా పండుగలకు ముస్తాబవుతుంది. ఆగస్టు 1న వీరబ్రహ్మం జెండా ఆవిష్కరణ జరిగితే 15న మువ్వన్నెల జెండా ఆవిష్కరణ జరుగుతుంది. 1835లో లంకెలపల్లి రామబ్రహ్మేంద్ర యోగులచే శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయధ్వజం స్థాపించబడిన నాటి నుంచి ప్రతి ఏటా ఈడుపుగల్లు గ్రామంలో ఆగస్టు 1న బ్రహ్మంగారి జెండా ఆవిష్కరణ వైభవంగా జరుపుకుంటారు. తరతరాలుగా ఎలాంటి ఆటంకం లేకుండా ఏటా జెండా పండుగ జరుపుకోవడం బ్రహ్మం గారి ఆశీస్సులే కారణమని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామం మధ్యలో ఆంజనేయ స్వామి ఆలయం పక్కనే కొలువైన బ్రహ్మం గారి ధ్వజస్తంభం అత్యంత ఎత్తులో ఊరికి రక్షణ ఇస్తున్నట్టుగా ఉంటుంది. వీరబ్రహ్మం వంశస్థులే ధ్వజాన్ని పడవలపై తెచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ప్రతిష్ఠ చేశారని గ్రామస్థుల కథనం. ఆగస్టు 1న జరిగే జెండా పండుగకు కొన్ని రోజుల ముందు నుంచే గ్రామంలో కోలాహలం మొదలవుతుంది. ధ్వజస్తంభాన్ని శుభ్రం చేసి, కొత్త జెండా ఎగురవేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారు. స్తంభానికి విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తారు. జెండా కోసం గ్రామంలోని చేనేత కళాకారులు స్వయంగా తయారు చేసిన కాషాయపు రంగు జెండాను ఆవిష్కరిస్తారు. ఈ ఏడాది పెనమలూరు గ్రామస్థులు ముసునూరు బాలమన్మధరావు, శ్రీలక్ష్మీ దంపతులచే జెండా పండుగ జరుపుకుంటున్నారు. కొత్త జెండా ఆవిష్కరణ అనంతరం తెల్లవారేలోపు ఖచ్చితంగా వర్షం కురుస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. పండుగ పూర్తయ్యాక జెండా వస్త్రాన్ని ముక్కలుగా చేసి ప్రతి ఇంటికీ అందజేస్తారు.

ఆర్టీసీ స్థలంపై జీవోను ఉపసంహరించుకోవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



జీవో కాపీలను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

బస్‌స్టేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్టాండ్ స్థలాన్ని 99 ఏళ్లకు విదేశీ సంస్థ లులుకు ఇచ్చిన జీవో నెం 137ను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. పాత బస్టాండ్ స్థలాన్ని ప్రైవేటుపరం చేయటాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వద్ద ఆందోళన నిర్వహించి జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌పేట సీఐ, పోలీసులు సీపీఎం కార్యకర్తలు, నేతలను అడ్డుకోగా కార్యకర్తలు ప్రతిఘటించారు. ఈ సందర్భంగా సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ నగరంలో నడిబొడ్డున సుమారు రూ.400 కోట్ల విలువైన స్థలాన్ని లులు సంస్థకు కట్టబెట్టటం దుర్మార్గమన్నారు. విశాఖపట్టణంలో 13.7 ఎకరాలు, విజయవాడలో 4.17 ఎకరాలు ప్రజల ఆస్తి అని, కూటమి ప్రభుత్వ సొమ్ము కాదన్నారు. ఈ ప్రజల ఆస్తిని బహుళ జాతి కంపెనీలకు అప్పజెప్పి ప్రజల పొట్ట కొడతారా? ఇదేనా మంచి ప్రభుత్వమంటే అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ వల్ల జీఎస్టీ పేరుతో వ్యాపారస్థులు అన్ని విధాల నష్టపోయారని, మరోపక్క డీమార్ట్, వాల్‌మార్ట్, రిలయన్స్ వల్ల వ్యాపారులు దెబ్బతిన్నారన్నారు. ఇక లులు మాల్ ఏర్పాటు చేస్తే ఏ వ్యాపారం బతకదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 దేశాల్లో వేల కోట్లతో వ్యాపారం చేసే లులు సంస్థకు డబ్బులేదా? ప్రభుత్వ స్థలమే కావాలా? ఇదేనా ప్రభుత్వం చేసేది అని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఆర్టీసీని కాపాడుకుంటాం, చిరు మధ్యతరగతి వ్యాపారులను దెబ్బతీసే లులు మాల్ జీవో రద్దయ్యే వరకు పోరాడతామన్నారు. సీపీఎం నగర కార్యదర్శులు భూపతి రమణ, బోయ సత్యబాబు, పీ కృష్ణ, నగర నేతలు కే దుర్గారావు, ఈవీ నారాయణ, సూరిబాబు, బీ చిన్నారావు, నాగేశ్వరరావు, కే రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం: ఈయూ

విజయవాడ నడిబొడ్డులోని ఏపీఎస్ఆర్టీసీ గవర్నర్‌పేట 1, 2 డిపోలను, పాతబస్టాండ్‌కు సంబంధించిన స్థలంతో పాటు, పాత బస్టాండ్ స్థలంలో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అర ఎకరా స్థలంలో ఏర్పాటు చేసిన మునిసిపల్ పార్క్‌తో పాటు వందల కోట్ల విలువైన 4.15 ఎకరాల భూమిని లులు షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తే ఆందోళన ఉధృతం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జారీ చేసిన జీఎంఎస్ 137ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న సాయంత్రం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రస్థాయి నాయకత్వంతో టెలీకాన్ఫరెన్స్ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కార్యక్రమాల రూపకల్పన చేస్తామని తెలిపారు. పోరాటానికి సంబంధించిన వివరాలను ప్రకటిస్తామన్నారు.

నగరంలో రెచ్చిపోయిన దొంగలు

● తూర్పు, పశ్చిమలో వరుస చోరీలు

● సుమారు రూ.29 లక్షల బంగారు ఆభరణాల మాయం

● కొత్తపేటలో రూ.5 లక్షల చోరీ



చోరీ జరిగిన గదిని పరిశీలిస్తున్న పోలీసులు

విజయవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఒక చోరీ కేసును ఛేదించేలోపు మరో చోరీ జరుగుతోంది. ఒక గ్యాంగ్‌ను పట్టుకోవడానికి వేట సాగిస్తుండగా మరోచోట తాళాలు, కిటికీలు పగిలిపోతున్నాయి. ఇదీ నగరంలోని ప్రస్తుత పరిస్థితి. విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో దొంగలు చెలరేగిపోయారు. తూర్పులో పటమట ఫన్‌టైం క్లబ్ వెనుకున్న ఓ ఇంటిని, పశ్చిమలోని కొత్తపేటలోని మరో ఇంటిని దొంగలు కొల్లగొట్టారు. ఫన్‌టైం క్లబ్ వెనక వాసవీ కన్యకాపరమేశ్వరి కాలనీ, రోడ్‌నెం 9లో ఉంటున్న గిరిజా శంకర్ వరప్రసాద్ వన్‌టౌన్‌లో గ్యాస్ కంపెనీ నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఆయన సతీమణి, పనిమనిషి ఉంటారు. వీరిద్దరూ వృద్ధులు కావడంతో కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన లక్ష్మిని కొన్నాళ్ల క్రితం పనిమనిషిగా నియమించుకున్నారు. వరప్రసాద్, ఆయన సతీమణి, పనిమనిషి లక్ష్మికి సంబంధించిన బంగారు ఆభరణాలను పడకగదిలోని బీరువాలో భద్రపరిచారు. పక్కనున్న పడకగదిలో వరప్రసాద్ దంపతులు, లక్ష్మి నిద్రపోయారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఇనుపరాడ్లతో కిటికీ ఊసను విరగ్గొట్టారు. అందులోంచి ఒక అమ్మాయిని లోపలకు పంపారు. బీరువా వద్ద ఉన్న తాళాలు తీసుకుని అందులోని 36 కాసుల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయారు. వాటి మొత్తం విలువ రూ.29 లక్షలుంటుంది. ఉదయం నిద్ర లేచి చూసుకునేసరికి బీరువా మొత్తం చెల్లాచెదురుగా కనిపించింది. దీంతో వరప్రసాద్ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్స్ ఏడీసీపీ ఎం రాజారావు, పటమట ఇన్‌స్పెక్టర్ వీ పవన్‌కిషోర్, క్రైం ఏఎస్సై గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్ర నమూనాలను సేకరించారు. చుట్టుపక్కలున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక అమ్మాయి స్కూటర్‌పై ఇంటికి వచ్చినట్టు కనిపించింది. ఆ అమ్మాయిని వెనుక ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు కిటికీ కన్నం ద్వారా లోపలకు పంపినట్టు దృశ్యాలు రికార్డయ్యాయి. చోరీ తర్వాత వీరితో పాటు మరో ఇద్దరు కలిసి వెళ్లిపోవడం ఫుటేజీలో కనిపించింది. స్కూటీ నెంబరు స్పష్టంగా కనిపించకపోవడంతో పోలీసులు సాంకేతికంగా విశ్లేషణ చేస్తున్నారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్తపేటలో..

చిట్టినగర్ అడ్డరోడ్డు వీధిలో ఉంటున్న కొండా కృష్ణ ఇంట్లో దొంగలు చొరబడ్డారు. ఆయన లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. కుమారుడు స్కూలుకు వెళ్లడంతో భార్య, కుమార్తె కలిసి కృష్ణ అత్తగారింటికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని దొంగలు పై అంతస్తులోని కృష్ణ ఇంటితాళం పగలకొట్టి లోపలకు వెళ్లారు. బీరువాను పగలకొట్టి రూ.5లక్షలు ఎత్తుకుపోయారు. దీనిపై కృష్ణ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ కొండలరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గృహనిర్మాణం నిమిత్తం డబ్బులు ఇంట్లో భద్రపరిచనట్టు పోలీసులకు చెప్పాడు.



ముతవల్లీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్

500 మందికి వక్ఫ్‌బోర్డు ఉచిత విద్య

● ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

వన్‌టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీల్లో ఉన్నవారికి అవి పదవులు కావు, బాధ్యతగా పనిచేయటానికి అప్పగించిన ప్రాతినిధ్యమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. వచ్చే ఏడాది 500 మంది ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్య అందించబోతున్నామని, ప్రతి వక్ఫ్‌బోర్డు సంస్థ భాగస్వామ్యం కావాలని సూచించారు. విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలోని ఇందాద్‌ఘర్ భవనంలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో సోమవారం 5వ వక్ఫ్‌బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన గత బోర్డు సమావేశంలో నిర్ణయించినట్టు ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వక్ఫ్‌బోర్డు సంస్థ ఆదాయానికి అనుగుణంగా విద్యార్థులను దత్తత తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్యతో పాటు ఉచిత ఐఏఎస్ కోచింగ్‌ను కూడా అందిస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి ముస్లిం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. ముస్లిం సమాజాన్ని ఉన్నత స్థితిలో నిలబెట్టేందుకు తనతో కలిసి రావాలని ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీలను కోరారు. సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాలన్నింటిపైన ఏకగ్రీవ తీర్మానం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ

పమిడిముక్కల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మంటాడలో అలివేలు మంగా, పద్మావతీ సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న శ్రావణమాస ఆగమన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం స్వామికి లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఉయ్యూరు, మంటాడ, తాడంకి పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఏ. రామ మోహన్‌రావు, ఈవో సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీ పూజ చేస్తున్న భక్తులు

అసలే కొరత.. ఆపై వసతుల లేమి

● ఐదేళ్లుగా మూతబడిన భూసార పరీక్షా కేంద్రం
● తుప్పుపట్టిన పరికరాలు
● సిబ్బంది కొరతతో తప్పని తిప్పలు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ రూరల్): గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న భూ సార పరీక్షా కేంద్రం అరకొర వసతులతో కూనారిల్లుతుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, అవగాహన లేమి వల్ల గత ఐదు సంవత్సరాలుగా భూసార పరీక్షా కేంద్రం మూతపడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే భూసార పరీక్షా కేంద్రానికి జవసత్వాలు తీసుకురావాలని డివిజనల్ భూసార కేంద్రాన్ని జిల్లా భూసార కేంద్రంగా మార్చారు. మార్చారే గానీ వసతుల లేమితో కొట్టు మిట్టాడుతుంది. గత ఐదేళ్ల నుంచి పరికరాలు పని చేయకపోవటంతో తుప్పు పట్టాయి. జిల్లా అధికారులు స్పందన లేకపోవటం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. గత నాలుగు నెలల నుంచి వ్యవసాయ శాఖాధికారులు భూసార పరీక్షా కేంద్రాన్ని మరమ్మతులు నిర్వహించారు. కేంద్ర భవనం మరమ్మతులు నిర్వహించి, మట్టి పరీక్షలు చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నా వసతుల లేమితో ఇప్పటి వరకు ఒక్క మండలం కూడా పూర్తి కానీ పరిస్థితి నెలకొంది. గతంలో 3 వేలు, 4 వేలు పరీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు 23 వేల మట్టి నమూనాలను పరీక్షించాల్సి ఉంటుంది. సిబ్బంది మాత్రం లేరు. 23 వేల మట్టి నమూనాను పరీక్షించాల్సింటే ప్రతీ రోజు 15 మంది మట్టినమూనాలను పరీక్షించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఐదుగురితోనే కొనసాగిస్తున్నారు. భూసార పరీక్ష కేంద్ర అధికారిణి వేరే మండలానికి బదిలీపై వెళ్లారు. బదిలీపై నూతనంగా వచ్చిన అధికారిణి వెంటనే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటం జరిగింది. మట్టి నమూనాలను పరీక్షించే ఇచ్చితత్వం నిర్వహించే క్వాలిటీ అధికారి ప్రస్తుతం అక్కడ లేరు. ఉన్న మండల వ్యవసాయాధికారి ఫోన్ల ద్వారా, పుస్తకాల ద్వారా వివరాలు తెలుసుకుని భూసార పరీక్ష కేంద్రంలో మట్టి నమూనాలు పరీక్షిస్తున్నారు. ఏడీఏ ఎస్.కవిత పర్యవేక్షిస్తూ త్వరగా మట్టి నమూనాల కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేకమైన అధికారులను నియమించాలని, సిబ్బందిని 15 నుంచి 20 మంది వరకు నియమించాల్సి ఉంది. అప్పుడు భూసార పరీక్షా కేంద్రంలో పరీక్షలు పూర్తి చేయటానికి అవకాశం ఉంటుంది. వరి నాట్లు ప్రారంభమైనా అయా మండలాల మట్టి నమూనాలు సంచులు కూడా కొన్ని మండలాల్లో ఓపెన్ చేయలేదు. జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలు మండలాల రైతులు కోరుతున్నారు.


నమూనా కేంద్రానికి వచ్చిన మట్టి సంచులు


మట్టిని పరీక్షించే ల్యాబ్‌లోని యంత్రాలు

సిబ్బంది కొరత ఉంది

సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. నూతనంగా వచ్చిన ఏవో దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఉన్న సిబ్బందితోనే పనులు ప్రారంభిస్తున్నాము. 23 వేల మట్టి నమూనా టార్గెట్టు పూర్తి చేయాల్సి ఉంది. సిబ్బంది కావాలని కోరాము.సిబ్బంది రావాల్సి ఉంది.

కవిత , వ్యవసాయ అధికారి

ప్రజా సంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. సోమవారం జమీగోల్వేపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామంలో నూతనంగా ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.38లక్షలతో నిర్మితమైన ఎనిమిది సీసీ రోడ్లను స్థానిక నేతలతో కలసి ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ నిర్వహణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు,పట్టణాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తుందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అని అడుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్‌మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండపాక శంకర్‌బాబు, జమీగోల్వేపల్లి ఎంపీటీసీ యేర్నిని అరవింద్‌బాబు, వేంకటరత్నం పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

దుకాణ అద్దెదారుల కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న దుకాణదారులు

గుడివాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం వాణిజ్య దుకాణాల అద్దెదారుల నూతన కమిటీ అధ్యక్షుడిగా నందకిషోర్, కార్యదర్శిగా ఆచంట వెంకటరత్నంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్టేడియం కమిటీ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా జవ్వాజి గంగరాజు, ఉపాధ్యక్షుడిగా శేగు సత్యనారాయణ, కూరాళ్ల రాజేష్ మాధవ్, సంయుక్త కార్యదర్శి దూరడ్ల శివకృష్ణ, కోశాధికారిగా ఆత్మకూరి శ్రీనివాస్, సభ్యులుగా ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు, రమణలు ఎంపికయ్యారు. మురళీకృష్ణ, కృష్ణారావు, సత్యనారాయణ, సుబ్బారావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

●ఎంపీడీవో ఎండి ఇమ్రాన్

గుడ్లవల్లేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 15 లోగా ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొత్త కాలనీల్లో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను పూర్తయ్యేలా చేయాలని గుడ్లవల్లేరు ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ హౌసింగ్ సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇమ్రాన్ పలు సూచనలు చేశారు. మండలంలో 2761 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకూ 1101 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 819 వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ఇంకా 841 స్థలాల్లో ఇంకా ఎటువంటి పనులూ ప్రారంభించనివి ఉన్నాయని హౌసింగ్ ఏఈ ఇన్‌చార్జ్ ఆలపాటి సురేంద్ర తెలిపారు. కాగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు 15 ఆగస్ట్ 2025 నాటికి నిర్మాణాలు లబ్ధిదారులు పూర్తిచేశాలా చూడాలన్నా రు. నిర్మాణాలు మొదలు పెడుతున్న వారు 31 డిసెంబరు 2025నాటికి పూర్తి చేయకుంటే వారికి కేటాయించిన స్థలాన్ని రద్దు చేస్తామని వివరించాలని ఆయనసూచించారు.


హౌసింగ్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో ఇమ్రాన్


సమావేశంలో మాట్లాడుతున్న విష్ణుప్రసాద్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గుడివాడ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై ఎంపీడీవో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే అర్జీలను గ్రామాల వారీగా క్రోడీకరించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పారిశుధ్యం, తాగునీరు, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే బలం

●ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలు, అభిమానులే బలమని, వారిని అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక 27వ వార్డులో టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ పామర్తి సత్తాబాబు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబసభ్యులను సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి పరామర్శించారు. నాయకులు రాంబాబు, ప్రసాద్, సాంబయ్య, పులవర్తి డేవిడ్, రెడ్డి అప్పారావు, శివశంకర్, వీరబాబు, ఉమామహేశ్వరరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

గుడివాడ : టీడీపీ జిల్లా నాయకులు ముళ్లపూడి రమేష్ చౌదరి తండ్రి బాబురావు సోమవారం మృతి చెందారు. బంటుమిల్లి మండలం మంజులూరులోని బాబురావు స్వగృహంలో ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, నివాళులర్పించారు.


ముళ్లపూడి బాబురావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల, కాగిత తదితరులు

గుడివాడ : నాయకుడిలా కాకుండా సహచరుడిగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో ప్రజాసమస్యల అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ రేషన్ కార్డుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. పట్టణంలోని డ్రెయినేజీ సమస్యలపై వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

● సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణ

పామర్రు, జూలై28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రక్షణగా నిలుస్తున్న పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య పేర్కొన్నారు. నిమ్మకూరు ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో తమ చుట్టూ ఉన్న మానవ మృగాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో ధైర్యంతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ,అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈకార్యక్రమంలో న్యాయవాది సాయికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రామకృష్ణయ్య

ఘనంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు

గుడివాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద వేంచేసియున్న భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని మాజీ చైర్మన్ చలసాని ఇందిరారమణరావు స్వగృహం నుంచి అమ్మవారికి సమర్పించే శ్రీవల్లీ పుత్తూరు నుంచి తీసుకొచ్చిన తిరుమంజన పూజా సామగ్రి, శ్రావణపట్టి సారెను మేళతాళాల మధ్య ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకువచ్చారు. గోదాదేవి ఉత్సవ మూర్తికి వేదపండితులు విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి శ్రావణపట్టి సారెను సమర్పించారు. లోక కల్యాణార్థం భక్తుల సహకారంతో అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వేదాంతం అప్పలాచారి, ధార్మిక సంస్థ ప్రతినిధులు చిన్ని, రమణమ్మ, కుమారి, ఆండాళ్ గోష్టి, గోదా గోష్టి సభ్యులు, పాల్గొన్నారు.


గోదాదేవికి శ్రావణ సారెను సమర్పించిన భక్తులు

రుణాలు మంజూరు చేయాలని వినతి

గుడ్లవల్లేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చర్మకారులు, డప్పుకళాకారులకు 40 సంవత్సరాలు దాటిన వారికి మాదిగ, లీడ్ క్యాప్ కార్పొరేషన్ రుణాలను ఇప్పించి వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లా త్యాగరాజు(కింగ్) గుడ్లవల్లేరు ఎంపీడీవో ఎండి ఇమ్రాన్‌ను కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో కలసి ఎంపీడీవోకి వినతిపత్రాన్ని అందజేశారు. కుందేటి నాగరాజు, గోగర్లమూడి కిరణ్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుడివాడ : స్థానిక ఆటోనగర్ 4వ రోడ్డులో నైజాంపేటకు చెందిన మహ్మద్ షబ్బీర్ టింకరింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు కుడిచెయ్యి గూడ జారి నరం కట్ అయింది. ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.లక్ష్మణరావు, అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

రెండు కిలోల వెండి వస్తువులు వితరణ

కూచిపూడి :కూచిపూడిలోని గంగా కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామికి గుడివాడకు చెందిన జాస్తి ఉమామహేశ్వరరావు దంపతులు రూ.2.50 లక్షల విలువ గల రెండు కిలోల వెండితో చేసిన ధారా పాత్ర, జాటాజుటం స్వామికి సమర్పించారు. దేవాలయ అర్చకులు పాండురంగ శర్మ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

గుడివాడ : స్థానిక నాగవరప్పాడు సెంటర్‌లోని డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని చెన్న సత్యనారాయణ అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని స్థానికులు గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ గణేష్ తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

ప్రసాదంపాడు: .గుడ్లవల్లేరు మండలం కౌతవరానికి చెందిన శ్రీనివాసరావు(29) కొత్త ఆటోనగర్‌లోని యూపీవీసీ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు.ఈ క్రమంలో తోటి ఉద్యోగి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై రామవరప్పాడు నుంచి ఎనికేపాడు కంపెనీ వసతికి వెళ్లే క్రమంలో ఎనికేపాడు జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా గన్నవరం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల కృషి మరువలేనిది

● సర్పంచ్ సింగాల రాధాకృష్ణ

నందివాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో గత ఐదేళ్లుగా లోఓల్టేజీతో తుమ్మలపల్లి గ్రామస్థులు పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదని తుమ్మలపల్లి సర్పంచ్ సింగాల రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ గ్రామ సమస్యలు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు విన్నవించుకోగా, మండలంలోనే ఏ గ్రామానికి చేయని విధంగా తుమ్మల గ్రామానికి రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, జిల్లా పరిషత్ రోడ్డు రూ.15 లక్షలతో ఎమ్మెల్యే ఆదేశాలతో గ్రాంటు రిలీజ్ చేసి రోడ్డు వేయించామన్నారు. నూతనంగా జిల్లా పరిషత్‌గ్రాంటుతో (సుమారు 2కిలోమీటర్ల దూరం) రూ.80 లక్షలతో రోడ్డు మంజూరై రెండు రోజుల్లో పనులు మొదలవుతాయని సర్పంచ్ తెలిపారు. అదేవిధంగా తమ గ్రామానికి విద్యుత్ సమస్య ఉందని వివరించగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి సుమారు రూ.5.50 లక్షలతో 35 కరెంట్ స్తంభాలు , ట్రాన్స్‌ఫార్మర్లు (63కేవీ లోడు) వేయుటకు గ్రాంటు మంజూరు చేయించారన్నారు. మంజూరైన గ్రాంటుతో సోమవారం తుమ్మలపల్లిలో షార్ట్ పోల్స్ మార్పునకు విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసరావుతో సర్పంచ్ రాధాకృష్ణ కొబ్బరికాయ కొట్టి పనులు మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్యా సత్యానందం, సుజాత్, నాగమునేంద్రరావు, శేషారత్నం, సతీష్, గోవర్ధన్, సాంబయ్య, ఆంజనేయులు, నాగమురళీ, వెంకటేశ్వరరావు, మల్లిఖార్జునరావు, పాల్గొన్నారు.


స్తంభం మార్పిడికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

పామర్రు సీడీపీవో భానుశ్రీకి పదోన్నతి

పామర్రు,జూలై28(ఆంధ్రజ్యోతి): పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా సేవలందిస్తున్న సి.బానుశ్రీ గుంటూరు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారిణిగా పదోన్నతి లభించింది.సంబంధిత రాష్ట్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

తోట్లవల్లూరు : కనకవల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి మరీదు మనోహర్(17) కలుపుమందు సేవించి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడని ఎస్సై సీహెచ్ అవినాష్ సోమవారం తెలిపారు. మనోహర్ ఉయ్యూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో మనోహర్ ద్వితీయ ఇంటర్ చదువుతున్నాడు. సక్రమంగా కాలేజీకి రావటంలేదని కాలేజీ యాజమాన్యం తెలియజేయటంతో ఈ నెల 16వ తేదీన తల్లిదండ్రులు సదరు కాలేజీకి వెళ్ళి మాట్లాడి వచ్చారు. తల్లిదండ్రులు కాలేజీకి రావటం, తనను మందలించటంతో మనోహర్ అదేరోజు రాత్రి కలుపుమందు సేవించాడని, విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతు ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో మృతిచెందాడని, మృతుని తండ్రి కనకచింతయ్య ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకుఅను మానస్పద మృతికింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఆందోళనలు


గుడివాడలో..

గుడివాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేసి, విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్ష నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్మార్ట్‌మీటర్లను బిగించడం నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం స్థానిక 25వ వార్డులోని పెద ఎరుకపాడులోని సచివాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, సురేష్, సాహితీ స్రవంతి అధ్యక్షుడు సురేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

కూచిపూడి : వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజాసంఘాల నేతలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజాసంఘాల నేతలు శివనాగేంద్ర, నారాయణరావు, కరుణాకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పామర్రులో..


కూచిపూడిలో..

పామర్రు : ప్రజలకు భారంగా నిలిచే విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఆగస్టు5న విద్యుత్ కార్యాలయాల ముందు ఆందోళనలు చేస్తామని ప్రకటించారు.దానికి ప్రజా మద్దతు కావాలని కోరుతూ సంతకాల సేకరించారు. గంగాధర్ ప్రసాద్, ఇంటిరాజు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



తల్లికి వందనం పడలేదని వినూత్నంగా వినతి

మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పడలేదని, అధికారులు స్పందించి పరిష్కరించాలంటూ గుడివాడ విద్యార్థినులు డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి గులాబీ పూలు ఇచ్చి వినూత్నంగా విజ్ఞప్తి చేశారు. సచివాలయం చుట్టూ ఆరు సార్లు తిరిగాం.. మండల స్థాయి అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు..అంటూ గుడివాడ గుడ్‌మెన్‌పేటకు చెందిన విద్యార్థిని చిత్తమనేని వెంకట గాయిత్రి, పలువురు విద్యార్థులు డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవికి వివరించారు. అధికారులు స్పందించి జిల్లా విద్యాశాఖాధికారికి పరిశీలన నిమిత్తం పంపారు.

పాస్‌పోర్టు దరఖాస్తుల విచారణలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతాం : ఎస్పీ



డీజీపీ అందజేసిన ప్రశంసా పత్రాన్ని ఎస్పీకి చూపిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

మచిలీపట్నం క్రైమ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పాస్‌పోర్ట్ దరఖాస్తులను త్వరితగతిన విచారణ చేపట్టడంలో రాష్ట్రంలో తృతీయ స్థానం సాధించామని, వచ్చే ఏడాదికి ప్రథమ స్థానంలో నిలుపుతానమి ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. జూలై 2024 - 2025 మధ్యకాలంలో 30 వేల పాస్‌పోర్ట్ దరఖాస్తుల విచారణ పూర్తిచేసినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా జిల్లా పోలీసులను అభినందిస్తూ ఇచ్చిన ప్రశంసాపత్రాన్ని స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా చూపించారు. బాగా పనిచేసి వచ్చే ఏడాది మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని ఎస్పీ సూచించారు. సామాన్య ప్రజలకు పోలీసు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిర్వచనంగా నిలుస్తామని ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం మీ కోసంకార్యక్రమంలో మొత్తం 38 మంది ఫిర్యాదులను ఎస్పీ ఆర్. గంగాధరరావుకు అందజేశారు. మీకోసంలో వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు విద్యాసాగర్‌కు సత్కారం



మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నాన్ అఫిషియల్ మెంబర్‌గా టీడీపీ నాయకుడు గుమ్మడి విద్యాసాగర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను పలువురు ప్రముఖులు సత్కరించారు. యూనియన్ బ్యాంకు విశ్రాంత అధికారి కొడాలి అజయ్‌కుమార్, విశ్రాంత ఎంపీడీవో పెనుమత్స మధు, మరియకుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దేవరపల్లి విక్టర్‌బాబు, ఆర్ఐ జుజ్జవరపు అనిల్‌కుమార్, న్యాయవాది అద్దేపల్లి నిరంజనరావు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు విజయ్‌కుమార్, కొడాలి యోహాన్, కె. ఏసుదాసు, మట్టా జయప్రకాష్, సిహెచ్. దేవపాల్, గణేష్, గంగ్రపు జీవన్‌కుమార్, గంగ్రపు సీనయ్య తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.



నాగాయలంక పుష్కర ఘాట్‌లో వరద, హెచ్చరిక పోర్టులు ఏర్పాటు చేసిన సీఐ యువకుమార్, ఎస్సై రాజేష్

నాగాయలంక రేవులో కృష్ణమ్మ పరవళ్లు

నాగాయలంక, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు దిగువకు విడుదల చేయటంతో సోమవారం నాగాయలంక రేవుకు భారీగా నీరు చేరింది. శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లో ఉన్న కృష్ణవేణమ్మ విగ్రహం మెట్లను దాటి పైపైకి చేరుతూ వరద నీరు పరవళ్లు తొక్కుతోంది. అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ కె.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేసి పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. వరద ఉధృతంగా వస్తుండటంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు. వరదను చూసేందుకు సందర్శకులు ఘాట్‌కి వస్తుండటంతో ఆ ప్రాంత మంతా కోలాహలంగా ఉంది.

స్థలం ఇప్పించండి బాబూ..వృద్ధురాలు వేడుకోలు



అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు చెరుకుమిల్లి వసంత

మచిలీపట్నం టౌన్ , జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చెరువుగట్టున 35 ఏళ్ల నుంచి కాపురం ఉంటున్నానని, ఇంటి పన్ను చెల్లిస్తున్నానని, ఒంటరి మహిళనైన తనకు స్థలం ఇప్పించాలని పెనమలూరుకు చెందిన 75 ఏళ్ల ఓ వృద్ధురాలు చెరుకుమిల్లి వసంత కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో వృద్ధురాలు మీడియాతో మాట్లాడారు. చెరువు వద్ద నివసించకూడదంటూ పంపించి వేశారన్నారు. ఐదేళ్లుగా చెట్టు కిందే వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ జీవనం సాగిస్తున్నానని, తెల్లరేషన్ కార్డు ఉన్న తనకు స్థలం ఇప్పించాలని వేడుకుంది.

పేదలకు సేవ చేయడంలో ఎంతో ఆనందం

● వాసవీ క్లబ్ గవర్నర్ అన్నం సాయి సునీత



యూనిఫాం పంపిణీ చేస్తున్న సాయి సునీత

మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవచేయడంలో ఎంతో ఆనందం, తృప్తి ఉంటాయని వాసవీ క్లబ్ గవర్నర్ అన్నం సాయి సునీత అన్నారు. సోమవారం సునీత వాసవి క్లబ్, వాసవి వనితా క్లబ్, వాసవి క్లబ్ ఆఫ్ కపుల్స్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లేడీ యాంప్తిల్ ప్రభుత్వ కళాశాలలో పేద విద్యార్థులకు వంద మందికి ఉచితంగా యూనిఫారం పంపిణీ చేశారు. శ్రీపాద ఫన్షన్ హాలులో పేదలకు గొడుగులు, దుప్పట్లు, చీరెలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ముత్యంగుడిలో, వర్రెగూడెం రామాలయానికి వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకులు బహూకరించారు. వైస్ గవర్నరు మాజేటి హరిప్రసాద్, ట్రెజరర్ సముద్రాల సూర్య ప్రకాశరావు, చిట్టూరి ప్రకాశరావు, ఐపిసి ఎండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, అన్నం అశోక్ , జె.దివ్య, అనూరాధ, విెకెఎస్ మూర్తి, ఉదయగిరి సతీష్, జె రాంబాబు, జె ప్రసాద్, ఎస్.గణేష్, శ్రీదేవి, ఆర్ షామిలి, ఎ.సంగీత, టి.మధు, తమ్మన ప్రసాద్, మామిడి భాస్కర్ తదితరులు సేవలందించారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పెరిగిన వేతనాలు అందించాలి

మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెరిగిన వేతనాలు అందించాలని సీఐటీయూ నాయకులు కోరారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు సోమవారం నాయకులు ఆముదాలపల్లి శంకర్, అనుమకొండ రంగబాబు, బి. సుబ్రహ్మణ్యం తదితరులు వినతిపత్రం సమర్పించారు. కేటగిరి-2 హోదాలో ఉన్న వారిని గ్రేడ్-1కు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వీఎన్‌వి హనుమప్రసాద్, సుబ్రహ్మణ్యం, వెంకటకృష్ణ, సులోచన పాల్గొన్నారు.



పెడనలో మహిళలకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



చల్లపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న బొబ్బ్బా గోవర్ధన్, మోర్ల



అవనిగడ్డలో కరపత్రాలను అందజేస్తున్న కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు

రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలన

పెడన, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన పెడనలో 16, 13, 14 వార్డుల్లో పర్యటించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీకి కట్టుబడి సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానుందని చెప్పారు. గ్రంథాలయం ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. విశ్వభారతి హైస్కూల్ రోడ్డు పక్కన ఎమ్మెల్యే మొక్కలు నాటారు. విశ్వభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ అనుముకొండ గౌరీప్రసాద్ రూ. 10 వేల విలువ గల వాటర్ డిస్పెన్సర్‌ను ఆరో వార్డు సచివాలయ సిబ్బందికి అందజేశారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని 13, 14 వార్డుల ప్రజలు కోరారు. ఎమ్మెల్యే ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. నాయకులు యక్కల శ్యామలయ్య, వహాబ్‌ఖాన్, అబ్దుల్ ఖయూం, పూలబాబు, కమ్మగంటి బాబు, ఎలిగట్ల ప్రసాద్, మెట్ల సుబ్రహ్మణ్యం, కొసనం భార్గవ్, కోరుమిల్లి వెంకట స్వామి, వాసా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** అఖండ విజయాన్ని అందించిన ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసి అగ్రగామి నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్ అన్నారు. చల్లపల్లి పడమరవీధిలో 73వ బూత్‌లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి మోర్ల శివ, టీడీపీ నేతలు రావి చిట్టి, మోర్ల ప్రసాద్, కొడాలి మురళి, షేక్ నబీఘోరి, తాతా ప్రదీప్, కంతేటి నళిని, షేక్ సిలార్, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** మండల పరిధిలోని గంజివానిపాలెం గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రావి రత్నగిరి,



గంజివానిపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న నేతలు



శ్రీకాకుళంలో కరపత్రాలు అందజేస్తున్న తాడికొండ వెంకటేశ్వరరావు,

వైఎస్ కడవకొల్లు సీతారామాంజనేయులు, మోపిదేవి పంచాయతీ పాలకవర్గ సభ్యురాలు బడుగు భారతి, బీసీ సెల్ అధ్యక్షుడు కందుల బసవయ్య, బల్ల ప్రసాద్, పీత కనకయ్య త దితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** సీఎం చంద్రబాబ నేతృత్వంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. అవనిగడ్డ రెండో వార్డు బీసీ కాలనీలో టీడీపీ నేతలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బీసీ కాలనీలోని పలువురు చిన్నారులు థ్యాంక్యూ సీఎం అంటూ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నేతలు కర్రా సుధాకర్, బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే నాగ వెంకట కనకదుర్గ, ఘంటసాల రాజ మోహనరావు (కన్నయ్య), విశ్వనాథపల్లి పాప, బచ్చు హనుమాన్, గుంటూరు వినయ్, నాగిడి రాంబాబు, షేక్ బాబావలి, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు. పాత ఎల్ఐసీ రోడ్డులో మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నేతృత్వంలో బీజేపీ, జనసేన నేతలతో కలసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. **ఘంటసాల :** పేదల అభ్యున్నతి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలుగుయువత రాష్ట్ర నాయకులు, ఎంపిటిసి సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం 1వ వార్డులో నిర్వహించారు. టీడీపీ నేతలు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి ఏడాది పాలనలో సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిని, ఉపసర్పంచ్ కొడాలి లక్ష్మణ్, బూత్ కన్వీనర్ ఆరేపల్లి డాంగే కుమార్, సొంసెట్టి నాగులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ



చల్లపల్లిలో సంతకాలు సేకరిస్తున్న నేతలు



బంటుమిల్లిలో కరపత్రాలు అందజేస్తున్న నేతలు

చల్లపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు అడ్డుకుందాం - విద్యుత్ చార్జీలు తగ్గించుకుందాం అనే నినాదంతో ప్రజావేదిక ఆధ్వర్యంలో చల్లపల్లిలో సోమవారం సాయంత్రం సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలనీ, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని కోరుతూ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసేందుకు ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. సంతబజారు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ, విద్యుత్ బిల్లులో ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరిట అధిక మొత్తం వసూలు చేస్తున్నారని, సామాన్య మధ్య తరగతి ప్రజలకు మోయలేని భారంగా మారాయని తెలిపారు. ఎన్నికల్లో విద్యుత్ భారాలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవటం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టాలని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చి న తర్వాత మీటర్లు బిగించాలని ఆదేశాలివ్వటం, స్మార్ట్‌మీటర్ల ఒప్పందాలను రద్దు చేయకుండా కొనసాగించటం రాష్ట్రప్రజలకు నమ్మక ద్రోహం చేసినట్లేనని విమర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ కార్యదర్శి కరీముల్లా, కాంగ్రెస్ సీనియర్ నేత మీర్ రిజ్వాన్, ఎంఎల్ పార్టీ నేత పరుచూరి జనార్ధన్, సీపీఐ నేత సిద్ధాబత్తుల బాలయ్య, నేతలు వాకా రామచంద్రరావు, కొండేటి భాస్కరరావు, గోళ్ల సాంబశివరావు, బండారు కోటేశ్వరరావు, బళ్ల వెంకటేశ్వరరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో కరపత్రాల పంపిణీ

బంటుమిల్లి : ఆదానీ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టం వివరిస్తూ బంటుమిల్లిలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని బీఎస్ఆర్ కాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంక దాసుల అజయ్‌ఘోష్, మాజేటి శివశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి ఆటోమ్యుటేషన్ అమలు

మచిలీపట్నం టౌన్ , జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఆటో మ్యుటేషన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తెలిపారు. ఇళ్లు, స్థలాలు కొనుగోలు, అమ్మకం సమయంలో ఇబ్బందులను తొలగించేందుకు ఆగస్టు 1 నుంచి ఆటో మ్యుటేషన్ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం యాజమాన్య హక్కుల బదలాయింపుకు సులభతరం చేస్తున్నామన్నారు. కొత్త విధానం ప్రకారం ఆస్తి పన్ను బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే మ్యుటేషన్ జరుగుతుందన్నారు. ఇంటిపన్ను డిమాండ్‌లో పేరు మార్పునకు ప్రజలు నగర పాలక సంస్థ కార్యాలయానికి తిరగకుండానే ఆటో మ్యుటేషన్ జరుగుతుందన్నారు.



కోట మల్లయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న తాతినేని శ్రీరామ్

కోట మల్లయ్య మృతి తీరని లోటు : తాతినేని

పెడన, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కోట మల్లయ్య మృతి కళారంగానికి తీరనిలోటని జిల్లా బీజేపీ అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ అన్నారు. బీజేపీ నాయకుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు స్వర్గీయ కోటమల్లయ్య సంస్మరణ సభ పడమరవీధిలోని ఆయన నివాసం వద్ద సోమవారం జరిగింది. నాయకులు కోట మల్లయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరామ్ మాట్లాడుతూ, పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని కోట మల్లయ్య విజయవంతం చేశారన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, ప్రజాహిత కార్యక్రమాలలో కోట మల్లయ్య కీలకపాత్ర పోషించారన్నారు. జిల్లా బీజేపీ కార్యదర్శి పుప్పాల రాము మాట్లాడుతూ, కోటమల్లయ్య సమాజానికి మేలు సందేశాత్మక నాటకాలను ప్రదర్శించి మన్ననలు అందుకున్నారని ప్రశంసించారు. మాజీ ఫ్లోర్ లీడర్ కట్టా హేమసుందరమూర్తి మాట్లాడుతూ, చేనేత పరిరక్షణకు, పట్టణ అభివృద్ధికి కోట మల్లయ్య అలుపెరుగని కృషి జరిపారన్నారు. బీజేపీ నాయకులు కట్టా జ్యోతీశ్వరరావు, పత్తిపాటి వెంకటరమణ, కొల్లూరి రాధాకృష్ణగుప్తా, కొఠారి మురళి పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను నిరోధించండి

మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై తిరిగే పశువుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం సమర్పించారు. ముస్తాఖాన్‌పేటలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆమోదించిన ప్లాన్ అతిక్రమించి అనధికారికంగా నిర్మాణాలు జరుగుతున్నాయని బురకా బాలాజీ ఫిర్యాదు చేశారు.

కొమరగిరి జయప్రదకు ప్రముఖుల నివాళి

మచిలీపట్నం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాణి పత్రిక సంపాదకురాలు, బాలాజీ విద్యాలయం వ్యవస్థాపకురాలు కొమరగిరి జయప్రద భౌతిక కాయాన్ని సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు సందర్శించి నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు జయప్రద అంత్యక్రియల్లో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు పి.వి. ఫణికుమార్, ఎంఈవో దుర్గాప్రసాద్, మాదిరెడ్డి మెహర్‌బాబా, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అడ్వయిజర్ లంకిశెట్టి బాలాజీ తదితరులు నివాళులర్పించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జగన్మోహనరావు

బంటుమిల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కాళాశాలలో స మాచార హక్కు చట్టంపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని సమాచార హక్కు చట్టంలోని అంశాలు వివరించారు. పౌరులు ప్రభుత్వం నుంచి సమాచారం ఎలా తెలుసుకోవాలో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ దేవజయరాజు, ఆర్.హిమాలినీ దేవి, డాక్టర్ ఎస్.సత్యరాజేష్, ఆనందకుమార్, రామారావు, జె.చలం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

21 మంది ఎస్టీలకు ఆధార్ కార్డులు

కోడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : లింగారెడ్డిపాలెం పంచాయతీ పెద్దగుడుమోటు గ్రామానికి చెందిన 21 మంది ఎస్టీలకు ఆధార్ కార్డులు మంజూరు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. లింగారెడ్డిపాలెం గ్రామసర్పంచ్ యర్రంశెట్టి శ్రీదుర్గ చేతులమీదుగా ఆధార్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఎస్టీల ఆధార్ సమస్యను గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి శ్రీదుర్గ తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా, వెం టనే ఆమె స్పందించి వీఆర్వోలను పంపించి విచారణ నిర్వహించి వారికి ఆధార్ కార్డు మంజూరు చేశారు. యర్రంశెట్టి దామోదర్‌రావు, వీఆర్వోలు పెనుమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఉత్పత్తిపై నైపుణ్య శిక్షణ

ఘంటసాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వరిలో నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరు రోజుల పాటు నిర్వహించే నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నాణ్యమైన విత్తన ఉత్పత్తికి అవసరమైన జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, తేమ శాతం, మొలక శాతం ఆవశ్యకతను ఉద్యాన శాస్త్రవేత్త మంజువాణి వివరించారు. విత్తనశుద్ధి, విత్తన మోతాదు, నారు మడుల యాజమాన్యం వంటి అంశాలపై సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి తెలియేశారు. గ్రామీణ యువత పాల్గొన్నారు.

బైక్ దగ్ధం.. తప్పిన ముప్పు

మచిలీపట్నం క్రైమ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వల్లూరి రాజా గారి సెంటర్ హోటల్ క్యాక్యా ఎదురుగా ఉన్న మెకానిక్ షెడ్‌లో బైక్ రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పెట్రోల్ పైపు లీక్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. మెకానిక్ చాకచక్యంగా వ్యవహరించి ఇసుకతోనూ, గోనె పట్టాలతో మంటలను ఆర్పటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.